# జనం రిపోర్టర్ తెలుగు దినపత్రిక

సంపుటి : 01 సంచిక : 285, ఎడిటర్: మార్పు సాయి కుమార్ పేజిలు : 08, వెల రూ. 5రూ/ శనివారం -15 - ఫిబ్రవరి - 2025

Published From, Guntur : Circulatedat,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna,Kurnool ,Srikakulam, Prakasam, Nellore, Chittoor,, Kadapa, Anantapuram, Hyderabad



విలేకరులు కావలెను

జనం రిపోర్టర్ తెలుగు దినపత్రిక

ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా నడపబడుతున్న జనం రిపోర్టర్ తెలుగు దినపత్రికలో పనిచేయుటకు

ఆంధ్ర మరియు తెలంగాణ రాష్ట్రాల్లో జిల్లాల వారిగా రిపోర్టర్లు కావలెను.

అంకిత భావంతో పనిచేసేందుకు ఆసక్తి గలవారు

సంప్రదించండి: 9398 15 6948


## యూపీఎస్సీ ఇండియన్ ఎకనామిక్ సర్వీస్ 2025 నోటిఫికేషన్.. ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం




న్యూఢిల్లీ : యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ఇండియన్ ఎకనామిక్ సర్వీస్ , ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీస్ ఎగ్జామినేషన్ 2025 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్ విధానంలో మార్చి 4, 2025వ తేదీ సాయంత్రం 6 గంటలలోగా దరఖాస్తు చేసుకోవాలి. ఈ ఏడాదికి ఇండియన్ ఎకనామిక్ సర్వీస్ లో 12 పోస్టులు, ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీస్ లో 35 పోస్టులు.. మొత్తం 47 పోస్టులను యూపీఎస్సీ భర్తీ చేయనుంది.

తలపై కత్తితో పొడిచి.. నోట్లో యాసిడ్ పోసి..

## ఏపీలో యువతిపై అత్యాచారం



- అన్నమయ్య జిల్లాలో ఘోరం
- తన ప్రేమను కాదన్నదనే కోపంతో అఘాయిత్యం
- ఆసుపత్రిలో మృత్యువుతో పోరాడుతున్న బాధితురాలు

2లో

టారిఫ్ ల విషయంలో తగ్గేదే లేదంటున్న ట్రంప్..

## భారత్ కు మినహాయింపేమీ లేదని వెల్లడి



- మీరెంత వేస్తే మేమూ అంత వేస్తామని స్పష్టం చేసిన ట్రంప్
- విదేశాల అధిక సుంకాలు ఇక అమెరికాకు సమస్య కాదని వివరణ
- మోదీతో భేటీకి ముందే ఉత్తర్వులపై సంతకం

2లో

ఢిల్లీ సీఎం ప్రమాణ స్వీకారానికి ముహూర్తం ఖరారు..

# 15 మంది ఎమ్మెల్యేలతో జాబితా సిద్ధం..!

## ఈ నెల 19 లేదా 20న ఢిల్లీ ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం

- ముఖ్యమంత్రి అభ్యర్థిత్వంపై కొనసాగుతున్న ఉత్కంఠ
- సోమ, మంగళ వారాల్లో సమావేశం కానున్న బీజేపీ శాసనసభా పక్షం
- ఈ భేటీలో కొత్త ముఖ్యమంత్రిపై స్పష్టత



న్యూఢిల్లీ : ఢిల్లీ ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం ఈ నెల 19 లేదా 20 తేదీల్లో ఉంటుందని భారతీయ జనతా పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు గత వారం విడుదలైన విషయం విదితమే. బీజేపీ గెలిచినా, ముఖ్యమంత్రి ఎవరనే అంశంపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఫ్రాన్స్, అమెరికా పర్యటన ముగించుకొని ప్రధానమంత్రి నరేంద్రమోదీ భారత్‌కు బయలుదేరారు. మిగతా..2లో

2లో

సెక్రటేరియట్‌లో ఊడిన పెచ్చులు..

## మంత్రి కోమటిరెడ్డి కీలక వ్యాఖ్యలు



- ప్రభుత్వానికి రీజినల్ రింగ్ రోడ్డు(ఆర్‌ఆర్‌ఆర్) లాంటి ప్రధానమైన పనులు చాలా ఉన్నాయి
- రెయిలింగ్ ఊడిన ఘటనపై విచారణ చేయాలి
- కొత్తగా నిర్మించిన తెలంగాణ సచివాలయం పీఓపీ కూలడం చర్చనీయాంశంగా మారింది

హైదరాబాద్: తెలంగాణ సెక్రటేరియట్‌లోసీఎం చాంబర్ పక్కన పెచ్చులు ఊడిన ఘటనపై రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పందించారు.

నా సొంత చెల్లిగా భావిస్తున్నా...

## యాసిడ్ బాధితురాలి తండ్రికి మంత్రి లోకేశ్ ఫోన్



- ప్రేమ పేరుతో యువతికి వేధింపులు
- యువతిపై దాడి చేసి అత్యాచారానికి పాల్పడిన యువకుడు
- తలపై కత్తితో పొడిచి, నోట్ల యాసిడ్ పోసి... అత్యాచారం
- చికిత్స పొందుతున్న బాధితురాలు

నీళ్ల కోసం మరో పోరాటానికి సిద్ధమవుదాం.. కేసీఆర్ ఆకాంక్షను నెరవేర్చుదాం : హరీశ్‌రావు



2లో

4 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు ఆరాటపడిన కేసీఆర్ ఆకాంక్షను నెరవేర్చుదామని సంగారెడ్డి జిల్లా ముఖ్య నాయకులకు, ప్రజలకు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పిలుపు

హైదరాబాద్ : నీళ్ల కోసం మరో పోరాటానికి సిద్ధమవుదాం.. 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు ఆరాటపడిన కేసీఆర్ ఆకాంక్షను నెరవేర్చుదామని సంగారెడ్డి జిల్లా ముఖ్య నాయకులకు, ప్రజలకు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల మిగతా..2లో

# చట్టానికి, న్యాయానికి చోటు లేదు..

## తీవ్ర అధికార దుర్వినియోగంతో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారురు

- మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ విషయంలో కూటమి సర్కార్ వ్యవహరిస్తున్న తీరు అత్యంత అన్యాయంగా ఉంది
- తప్పుడు కేసు పెట్టించారంటూ సాక్షాత్తూ జడ్జి ముందు దళిత యువకుడు వాంగ్మూలం
- ప్రజల దృష్టిని మళ్లించడానికి మా పార్టీకి చెందిన నాయకులను, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని తప్పుడు కేసులు



: వల్లభనేని వంశీ అరెస్టు ఏపీ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యవహారంపై టీడీపీ, వైసీపీ మధ్య వార్ జరుగుతోంది. వంశీ అక్రమాలు చేశాడంటూ టీడీపీ ఆరోపిస్తుంటే.. ఆయనకు మద్దతుగా నిలుస్తోంది వైసీపీ. తాజాగా ఇదే అంశంపై స్పందించారు వైఎస్ జగన్. చట్టానికి, న్యాయానికి చోటు లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ట్రంప్ తో భేటీలో అక్రమ వలసలపై

## మోదీ సంచలన వ్యాఖ్యలు



- చట్టవిరుద్ధంగా ప్రవేశించిన వారికి ఆ దేశంలో ఉండే హక్కు ఉండదన్న ప్రధాని
- అమెరికాలో అక్రమంగా ఉంటున్న భారతీయులను వెనక్కి తీసుకొస్తామని ప్రకటన
- అగ్రరాజ్యం అధ్యక్షుడితో భేటీ తర్వాత మీడియాతో మాట్లాడిన మోదీ

ఎమ్మెల్సీ ఎన్నికలు... సమన్వయకర్తలను

## నియమించిన పవన్ కల్యాణ్



- రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు
- పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా సమన్వయకర్తలను నియమించిన పవన్
- విజయవాడ సమన్వయకర్తగా అమ్మిశెట్టి వాసు

## వీహెచ్ కోసం పెద్ద పదవి : సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం



వివరాలు 2లో..

- క్యాబినెట్ హోదా ఉండే ఆ పదవిని వీహెచ్ కు కేటాయించాలని సీఎం రేవంత్ రెడ్డి
- వయసు రీత్యా ప్రత్యక్ష ఎన్నికల్లో తలపడలేకపోయిన ఆయన నామినేటెడ్ పదవిపై ఆశ పెట్టుకున్నారు
- కాంగ్రెస్ పార్టీ ఓబీసీ విభాగం జాతీయ చైర్మన్ పదవిని కూడా వీహెచ్ కు ఇచ్చే ఆలోచనలో కాంగ్రెస్ అధిష్టానం ఉంది
- రాష్ట్రంలో బీసీ నాయకత్వాన్ని ప్రోత్సహించాలని భావిస్తోంది

హైదరాబాద్ : తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ నేత, గాంధీ కుటుంబ విధేయుడు వీ.హన్మంతరావు (వీహెచ్) ఆశలు నెరవేరనున్నాయి. చాలా కాలంగా ఏదో నామినేటెడ్ పదవి కోసం ఎదురుచూస్తున్న వీహెచ్ కు అధిష్టానం బంపర్ ఆఫర్ ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. స్థానిక ఎన్నికల ముందు సీనియర్లకు పదవులు కేటాయించాలని హైకమాండ్ సూచించడంతో ముందుగా వీహెచ్ కు ప్రాధాన్యమివ్వాలని మిగతా..2లో

# యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ కోసం స్థలాలను గుర్తించాలి

## సమావేశంలో విద్యాశాఖ అధికారులకు కీలక ఆదేశాలు జారీ

- ఆ పాఠశాలలకు స్థలాలను త్వరగా కేటాయించాలి: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- అనుమతులకు సంబంధించిన పనులు వేగవంతం చేయాలని ఆదేశం
- అనువుగా లేనిచోట ప్రత్యామ్నాయం చూడాలన్న రేవంత్ రెడ్డి



వివరాలు 2లో..

అమరావతి : : అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మించాలని ప్రభుత్వం సంకల్పించింది. వీటికి సంబంధించి నిర్దేశిత గడువులోగా పనులు పూర్తయ్యేలా ప్రణాళికలు ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి విద్యాశాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు.

### తలపై కత్తితో పొడిచి.. నోట్లో యాసిడ్ పోసి..

## ఏపీలో యువతిపై అత్యాచారం

అమరావతి : ప్రేమ పేరుతో తమ కూతురును ఓ యువకుడు వేధిస్తుండడంతో తల్లిదండ్రులు ఆమెకు పెళ్లి నిశ్చయం చేశారు. పెళ్లి చేసి పంపిస్తే కూతురు సంతోషంగా ఉంటుందని భావించారు. అయితే, ఆ యువకుడు పగతో తమ కూతురు జీవితాన్ని నాశనం చేస్తాడని ఊహించలేకపోయారు. ఏపీలోని అన్నమయ్య జిల్లా ప్యారంపల్లె గ్రామంలో ఓ యువతిపై ఘోరంగా అత్యాచారం జరిగింది. ప్రేమిస్తున్నానంటూ కొంతకాలంగా వేధిస్తున్న యువకుడే ఈ దారుణానికి పాల్పడ్డాడు. అత్యంత పాశవికంగా బాధితురాలి నోట్లో యాసిడ్ పోసి, తలపై కత్తితో పొడిచాడు. బాధతో అరుస్తున్నా కనికరించకుండా దారుణంగా అత్యాచారం చేసి పారిపోయాడు. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదుతో దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు.. నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.పోలీసులు, బాధిత కుటుంబం తెలిపిన వివరాల ప్రకారం.. గుర్రంకొండ మండలంలోని ప్యారంపల్లె గ్రామానికి చెందిన యువతిని అమ్మచెరువు మిట్టకు చెందిన గణేష్ వేధింపులకు గురిచేశాడు. ప్రేమిస్తున్నాననంటూ వెంటపడుతుండేవాడు. ఈ విషయాన్ని ఆ యువతి తన తల్లిదండ్రులకు చెప్పింది. పెళ్లీడుకు వచ్చిన కూతురు అభాసుపాలవుతుందనే భయంతో తల్లిదండ్రులు ఆమెకు సంబంధం కుదిర్చి ఏప్రిల్ 29 న పెళ్లి నిశ్చయం చేశారు. ఈ విషయం తెలుసుకున్న గణేష్ ఆ యువతిపై కోపం పెంచుకున్నాడు. ఒంటరిగా వెళుతున్న సమయం చూసి యువతిపై దాడి చేశాడు. కత్తితో తలపై పొడిచి, నోట్లో యాసిడ్ పోశాడు. దారుణంగా అత్యాచారం చేసి పారిపోయాడు. యువతిని గమనించిన స్థానికులు ఆమె తల్లిదండ్రులకు సమాచారం అందించి బాధితురాలిని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో బాధితురాలు చికిత్స పొందుతోంది. ఆమె పరిస్థితి విషమంగానే ఉందని వైద్యులు తెలిపారు.

### టారిఫ్ ల విషయంలో తగ్గేదే లేదంటున్న ట్రంప్..

## భారత్ కు మినహాయింపేమీ లేదని వెల్లడి

న్యూఢిల్లీ : అమెరికా ప్రజల ప్రయోజనాలే తనకు ముఖ్యమని ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ తేల్చిచెప్పారు. అమెరికాపై పన్నులు విధించే ఏ దేశమైనా సరే అంతే మొత్తంలో అమెరికా నుంచి టారిఫ్ లు ఎదుర్కోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. 'మీరు ఎంత విధిస్తే మేమూ అంతే విధిస్తాం.. ఇందులో ఎక్కువ తక్కువలకు చోటులేదు' అని చెప్పారు. ఈ విషయంలో తగ్గేదేలేదని, మిత్ర దేశమే అయినప్పటికీ భారత్ కు ఈ విషయంలో మినహాయింపు ఇవ్వలేమని అన్నారు. విదేశాల నుంచి తాము చాలా ఎక్కువ పన్నులు ఎదుర్కొంటున్నామని ట్రంప్ వివరించారు. తన మొదటి టర్మ్ లో ఈ విషయంపై ఆయా దేశాలతో సంప్రదింపులు జరిపినా ఎలాంటి రాయితీ పొందలేకపోయామని ట్రంప్ గుర్తుచేశారు. దీంతో పరస్పర పన్నులు విధించాలని నిర్ణయించినట్లు వివరించారు. ఇకపై అమెరికాకు విదేశాల అధిక సుంకాల బాధ తప్పుతుందని చెప్పారు. భారత ప్రధాని నరేంద్ర మోదీతో భేటీకి కొన్ని గంటల ముందే ట్రంప్ ఈ రెసీప్రోకల్ టారిఫ్ ల ఫైలుపై సంతకం చేశారు. అమెరికా వస్తువులపై ఏ దేశమైనా ఎంత పన్ను విధిస్తుందో అంతే మొత్తంలో ఆయా దేశాలపై అమెరికా పన్ను విధిస్తుందని స్పష్టం చేశారు. అమెరికా ప్రజలకు సంబంధించినంత వరకు ఇది సరైన చర్యేనని సమర్థించుకున్నారు. యూరప్ దేశాలు, చైనా తమపై అత్యధిక పన్నులు విధిస్తున్నాయని ట్రంప్ చెప్పారు. చాలా విషయాల్లో అడ్వాంటేజ్ తీసుకొంటున్నాయని, దీనిపై అమెరికా ఏమాత్రం సంతృప్తిగా లేదని వివరించారు. తాను అధికారంలోకి రాకముందు చైనాపై అమెరికా ఎలాంటి పన్ను విధించేది కాదని, తన మొదటి టర్మ్ లో చైనాపై పది శాతం పన్ను విధించానని ట్రంప్ గుర్తుచేశారు.

### యూపీఎస్సీ ఇండియన్ ఎకనామిక్ సర్వీస్ 2025 నోటిఫికేషన్..

## ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం

మొదటి పేజి తరువాయి

ఎకనామిక్ సర్వీస్ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు తప్పనిసరిగా ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఎకనామిక్స్, అప్లైడ్ ఎకనామిక్స్, బిజినెస్ ఎకనామిక్స్ లేదా ఎకనామెట్రిక్స్‌లో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీలో ఉత్తీర్ణత పొంది ఉండాలి. అలాగే స్టాటిస్టికల్ సర్వీస్‌కు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు తప్పనిసరిగా స్టాటిస్టిక్స్, మ్యాథమెటికల్ స్టాటిస్టిక్స్/ అప్లైడ్ స్టాటిస్టిక్స్ విభాగంలో డిగ్రీ, మాస్టర్స్ డిగ్రీలో ఉత్తీర్ణత పొంది ఉండాలి. అభ్యర్థుల వయోపరిమితి ఆగస్టు 01, 2025 నాటికి తప్పనిసరిగా 21 నుంచి 30 సంవత్సరాల మధ్య ఉండాలి. ఈ అర్హతలున్నవారు ఎవరైనా ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభమయ్యాయి. దరఖాస్తు రుసుము కింద ప్రతి ఒక్కరూ రూ.200 చెల్లించాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళా అభ్యర్థులకు ఫీజు చెల్లింపుల నుంచి మినహాయింపు ఉంటుంది. ఇక తుది గడువు ముగిసిన 7 రోజుల్లోపు అంటే మార్చి 5 నుంచి 11, 2025వ తేదీ వరకు అప్లికేషన్ ఎడిట్ చేసుకోవడానికి అవకాశం ఇస్తారు. అలాగే దరఖాస్తులను ఉపసంహరించుకోవడానికి కూడా ఈ ఏడు రోజుల్లోనే అవకాశం ఉంటుంది. రాత పరీక్ష, ఇంటర్వ్యూ లేదా పర్సనాలిటీ టెస్ట్ ఆధారంగా తుది ఎంపిక ఉంటుంది. ప్రశ్నాపత్రం ఆబ్జెక్టివ్-టైప్ విధానంలో ఉంటుంది. ప్రతి తప్పు సమాధానికి నెగెటివ్ మార్కింగ్ ఉంటుంది. యూపీఎస్సీ-ఐఈఎస్/ ఐఎస్ఎస్ఈ 2025 పరీక్ష జూన్ 20, 2025వ తేదీన నిర్వహిస్తారు. ఇతర వివరాలు ఈ కింది అధికారిక నోటిఫికేషన్‌లో చెక్ చేసుకోవచ్చు.

### నా సొంత చెల్లిగా భావిస్తున్నా...

## యాసిడ్ బాధితురాలి తండ్రికి మంత్రి లోకేశ్ ఫోన్

అమరావతి : అన్నమయ్య జిల్లా గుర్రంకొండ మండలం ప్యారంపల్లెకు చెందిన యాసిడ్ బాధితురాలు తండ్రి జనార్ధన్ కు మంత్రి నారా లోకేశ్ ఫోన్ చేశారు. బాధితురాలి ఆరోగ్యంపై వాకబు చేశారు. ఆయనకు పూర్తి భరోసా ఇచ్చారు. "చెల్లి కోలుకోవడానికి అత్యంత మెరుగైన వైద్యం అందిస్తాం. ఆమెను నా సొంత చెల్లిగా భావించి అండగా నిలుస్తా. యాసిడ్ దాడి ఘటన నన్ను తీవ్ర ఆందోళనకు గురి చేసింది. దాడిచేసిన ఉన్మాదిని కఠినంగా శిక్షిస్తాం, అలాంటి సైకోలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించం. అధైర్య పడొద్దు, మీ వెంట నేనున్నాను" అంటూ మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. అక్కడే ఉన్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్ తో కూడా మాట్లాడిన లోకేశ్... బాధితురాలు కోలుకోవడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఆమె వైద్యానికి సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షించాల్సిందిగా సూచించారు.

### ట్రంప్ తో భేటీలో అక్రమ వలసలపై

## మోదీ సంచలన వ్యాఖ్యలు

న్యూఢిల్లీ : అక్రమ వలసలు ప్రపంచంలోని ఏ దేశానికైనా సమస్యేనని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. ఎవరైనా సరే ఓ దేశంలోకి అక్రమంగా ప్రవేశించి, అక్కడే సెటిలవుతామని అంటే కుదరదని స్పష్టం చేశారు. చట్టవిరుద్ధంగా అడుగుపెట్టిన వారికి ఆ దేశంలో ఉండే హక్కు ఉండదని తేల్చిచెప్పారు. ఇది ప్రపంచంలోని ఏ దేశానికైనా వర్తిస్తుందని పేర్కొన్నారు. అమెరికాలోకి అక్రమ వలసలపై మాట్లాడుతూ మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. అగ్రరాజ్యంలో అక్రమంగా ఉంటున్న భారతీయులను వెనక్కి తీసుకొస్తామని, ఈ విషయంలో ప్రెసిడెంట్ ట్రంప్ కు సహకరిస్తామని చెప్పారు. అమెరికాలోకి అక్రమంగా ప్రవేశించిన భారతీయుల్లో చాలామంది హ్యూమన్ ట్రాఫికింగ్ బారిన పడ్డవారేనని మోదీ చెప్పారు. కొంతమంది స్వార్థపరులు ఉద్యోగాలు, డాలర్ల ఆశజూపి అమాయకులను మోసం చేస్తున్నారని చెప్పారు. వారి మాయమాటలు నమ్మి అడ్డదారుల్లో యువత, పేదరికంతో బాధపడుతున్న వారు అక్రమ వలసదారులుగా మారుతున్నారని వివరించారు. ఏం జరుగుతోందో, ఏంచేస్తున్నామో తెలియకుండానే వారు ఈ అక్రమ రవాణా కూపంలోకి అడుగుపెడుతున్నారని తెలిపారు. ఈ దారుణాలను సమూలంగా నిర్మూలించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ దిశగా భారత్ ప్రయత్నిస్తుందని, దీనికి ట్రంప్ సహకారం అందిస్తారని ఆశిస్తున్నట్లు మోదీ తెలిపారు.

### ఎమ్మెల్సీ ఎన్నికలు... సమన్వయకర్తలను

## నియమించిన పవన్ కల్యాణ్






ఏపీలో ఎమ్మెల్సీ ఎన్నికలకు సమయం దగ్గర పడుతోంది. ఉభయగోదావరి, ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాలకు సంబంధించి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నాయి. నామినేషన్ల ఉపసంహరణకు గడువు కూడా ముగిసింది. ఈనెల 27న పోలింగ్ జరగనుంది. మార్చి 3వ తేదీన ఫలితాలు వెలువడనున్నాయి. ఈ క్రమంలో కూటమి పార్టీలు ఎన్నికలపై పూర్తి స్థాయిలో దృష్టి సారించాయి. ఎన్నికలకు ముందు జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా సమన్వయకర్తలను నియమించారు.

**పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా జనసేన సమన్వయర్తలు వీరే:**

రాజమండ్రి - యర్నాగుల శ్రీనివాసరావు,,కాకినాడ - తుమ్మల రామస్వామి,అమలాపురం - బండారు శ్రీనివాసరావు,నరసాపురం - చన్నమల్ల చంద్రశేఖర్,ఏలూరు - రెడ్డి అప్పలనాయుడు,మచిలీపట్నం - బండి రామకృష్ణ,విజయవాడ - అమ్మిశెట్టి వాసు,గుంటూరు - నయబ్ కమల్,నరసరావుపేట - వద్రాణం మార్కండేయ బాబు

# యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ కోసం స్థలాలను గుర్తించాలి

మొదటి పేజి తరువాయి

సీఎం రేవంత్ రెడ్డి విద్యాశాఖ ఉన్నతాధికారులతో.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో విద్యాశాఖ అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌కు సంబంధించి.. అవసరమైన స్థలాల సేకరణ, ఇతర పనుల పురోగతిని ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు పనులు వేగంగా చేయాలి.. నియోజకవర్గాల్లో స్థలాల కేటాయింపు ప్రక్రియ పూర్తయిన చోట.. అనుమతులు, ఇతర పనులను వేగంగా చేయాలని సీఎం ఆదేశించారు. ప్రతిపాదిత స్థలాలు రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటుకు అనువుగా ఉన్నాయో లేదో ముందుగా పరిశీలించాలని సూచించారు. అనువైన స్థలం లేని చోట ప్రత్యామ్నాయ స్థలాన్ని సేకరించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.వారంలో నివేదిక ఇవ్వాలి.. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల కోసం జిల్లా కలెక్టర్లు క్షేత్ర స్థాయిలో పర్యటించాలని.. త్వరగా స్థలాలను గుర్తింపు ప్రక్రియను పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. దీనిపై వారం రోజుల్లో నివేదిక అందించాలని స్పష్టం చేశారు. ఇప్పటికే స్థల సేకరణ జరిగిన నియోజకవర్గాల్లో యుద్ధ ప్రాతిపదికన పనులు మొదలు పెట్టాలన్నారు. రెండేళ్లలో 105 నియోజకవర్గాల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలతో వంద శాతం పనులు పూర్తికావాలని స్పష్టం చేశారు. ఇవీ స్కూల్స్ లక్ష్యాలు.. విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించడం.. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ లక్ష్యం. పోటీ ప్రపంచంలో రాణించేలా విద్యార్థులను తీర్చిదిద్దనున్నారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి తోడ్పాటు అందించనున్నారు. అత్యాధునిక వసతులు కలిగిన విశాలమైన క్యాంపస్‌లు నిర్మించనున్నారు. ఈ స్కూల్స్‌లో 4వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు బోధన



ఉండనుంది. 26 నియోజకవర్గాల్లో.. మొదటి దశలో 26 నియోజకవర్గాల్లో పాఠశాలల నిర్మాణాన్ని ప్రారంభించారు. ఒక్కో పాఠశాలలో 2,560 మంది విద్యార్థులు చదువుకునే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలకు వీటిల్లో ప్రాధాన్యత ఇవ్వనున్నారు. విద్యార్థుల వ్యక్తిగత అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. నిధులు ఇచ్చేందుకు సిద్ధం.. వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయ అభివృద్ధికి అవసరమైన నిధులు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని.. సీఎం రేవంత్ స్పష్టం చేశారు. ఈ విశ్వవిద్యాలయంలో భవిష్యత్తు అవసరాలకు తగినట్టుగా.. పూర్తి స్థాయి ప్రమాణాలతో సరైన మౌలిక వసతులు కల్పించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.

# ఢిల్లీ సీఎం ప్రమాణ స్వీకారానికి ముహూర్తం ఖరారు.. 15 మంది ఎమ్మెల్యేలతో జాబితా సిద్ధం..!

మొదటి పేజి తరువాయి

ఈ క్రమంలో సోమ, మంగళవారాల్లో బీజేపీ శాసనసభా పక్ష నేతలు సమావేశం కానున్నారని తెలుస్తోంది. ఈ భేటీకి ప్రధాని మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సహా పలువురు కీలక నేతలు హాజరు కానున్నారు. ఈ సమావేశం అనంతరం నూతన ముఖ్యమంత్రి ఎవరనే దానిపై స్పష్టత రానుంది. 27 ఏండ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ దేశ రాజధాని ఢిల్లీలో బీజేపీ అత్యధిక సీట్లు గెలిచి అధికారాన్ని కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. 70 అసెంబ్లీ స్థానాలకు గానూ ఇటీవలే జరిగిన ఎన్నికల్లో బీజేపీ ఏకంగా 48 స్థానాల్లో గెలిచింది. ఇక ఆమ్ ఆద్మీ పార్టీ కేవలం 22 స్థానాలతోనే సరిపెట్టుకుంది. ఈ నేపథ్యంలో హస్తినలో ప్రభుత్వ ఏర్పాటుకు కమలం పార్టీ సిద్ధమవుతోంది. ఇందుకు సంబంధించిన సన్నాహకాలు కూడా మొదలు పెట్టింది. అయితే, సీఎం అభ్యర్థి ఎవరన్నదానిపై మాత్రం ఇప్పటి వరకూ క్లారిటీ లేదు. రేసులో పలువురు ముఖ్య నేతల పేర్లు వినిస్తున్నాయి. ఈ క్రమంలో ఢిల్లీలో ప్రభుత్వ ఏర్పాటుకు బీజేపీ హైకమాండ్ ముహూర్తం పెట్టినట్లు తెలిసింది. ఇందుకోసం 48 మందిలో 15 మంది ఎమ్మెల్యేలతో కూడిన జాబితా సిద్ధం చేసినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. వీరిలో తొమ్మిది మందిని షార్ట్ లిస్ట్ చేసి.. సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు, స్పీకర్‌ను ఖరారు చేసే అవకాశం ఉంది. ప్రస్తుతం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అమెరికా పర్యటనలో ఉన్న విషయం తెలిసిందే. ఈ పర్యటన ముగించుకొని ఇవాళ రాత్రికి లేదా రేపు ఉదయానికి ఢిల్లీ చేరుకునే అవకాశం ఉంది. మోదీ ఢిల్లీ వచ్చిన వెంటనే ప్రధానితో అమిత్ షా, జేపీ నడ్డా సహా బీజేపీ ముఖ్య నేతలు భేటీ కానున్నట్లు సమాచారం. మోదీతో చర్చలు జరిపి ఓ అంచనాకు రానున్నట్లు తెలిసింది. ఇక ఈ నెల 17, 18 తేదీల్లో శాసనసభా పక్ష సమావేశం ఏర్పాటు చేసి సీఎం అభ్యర్థిని ఎన్నుకోనున్నారు. 19, 20 తేదీల్లో సీఎం ప్రమాణ స్వీకారం ఉంటుందని ప్రభుత్వ వర్గాలను ఊటంకిస్తూ జాతీయ మీడియా పేర్కొంది.

సీఎం రేసులో పర్వేశ్ వర్మ ముందంజ..!



కమలం పార్టీ అధికారికంగా సీఎం పేరు ప్రకటించనప్పటికీ, ఈ రేసులో ముందంజలో ఉన్న పలువురి పేర్లు ఇప్పటికే రాజకీయ వర్గాల్లో చక్కర్లు కొడుతున్నాయి. అందులో ఆప్ చీఫ్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను ఓడించిన పర్వేశ్ వర్మ ముందంజలో ఉన్నారు. పర్వేశ్ వర్మ: ఈయన ఢిల్లీ మాజీ సీఎం సాహిబ్ సింగ్ వర్మ కుమారుడు. అత్యంత ప్రతిష్టాత్మకమైన న్యూఢిల్లీ అసెంబ్లీ నియోజకవర్గంలో మాజీ సీఎం, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌పై వర్మ గెలుపొందడం విశేషం. ఇది ఆయనకు కలిసొచ్చే అంశం.

రమేశ్ బిధూరి: ఈయన మాజీ ఎంపీ. గుజ్జర్ సామాజికవర్గానికి చెందిన ముఖ్య నాయకుడు. ఢిల్లీ సీఎం ఆతిశీపై పోటీ చేశారు. రమేశ్ ఢిల్లీ బీజేపీలో కీలక నాయకుడిగా కొనసాగుతున్నారు.

బన్సూరి స్వరాజ్: విదేశీ వ్యవహారాల మాజీ మంత్రి, దివంగత సుష్మా స్వరాజ్ కుమార్తె బన్సూరి స్వరాజ్. న్యూఢిల్లీ నుంచి మొదటిసారి ఎంపీగా ఎన్నికయ్యారు. అతి తక్కువ కాలంలోనే ఢిల్లీ బీజేపీలో గుర్తింపు పొందారు.

స్మృతి ఇరానీ: ఒకప్పటి బీజేపీ ముఖ్య లీడర్లలో స్మృతి ఇరానీ ఒకరు. కానీ, గత లోక్‌సభ ఎన్నికల్లో ఓడిన తర్వాత ఆమె తెరమరుగయ్యారు. ఇప్పుడు సీఎం రేసులో ఆమె కూడా ఉన్నట్టు సమాచారం.

# చట్టానికి, న్యాయానికి చోటు లేదు..

మొదటి పేజి తరువాయి

వైఎస్ జగన్ రాష్ట్రంలో చట్టానికి, న్యాయానికి చోటు లేకుండా పోయిందని.. వైసీపీ చీఫ్ జగన్ వ్యాఖ్యానించారు. తీవ్ర అధికార దుర్వినియోగంతో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని విమర్శించారు. అక్రమ అరెస్టులు చేస్తూ.. అసలు రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నారని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ విషయంలో కూటమి సర్కార్ వ్యవహరిస్తున్న తీరు అత్యంత అన్యాయంగా ఉందని ట్వీట్ చేశారు. తప్పులను తట్టుకోలేక.. 'గన్నవరం కేసులో తనపై టీడీపీ వారు ఒత్తిడి తెచ్చి.. తప్పుడు కేసు పెట్టించారంటూ సాక్షాత్తూ జడ్జి ముందు దళిత యువకుడు వాంగ్మూలం ఇచ్చాడు. అధికార పార్టీ కుట్రను బట్టబయలు చేస్తే.. తమ బండారం బయటపడిందని, తమ తప్పులు బయటకు వస్తున్నాయని తట్టుకోలేక.. దాన్నికూడా మార్చేయడానికి చంద్రబాబు దుర్మార్గాలు చేస్తున్నారు' చేస్తున్నారని జగన్ ఆరోపించారు. ఎంతవరకు కరెక్టు.. 'సత్యానికి కట్టుబడి నిజాలు చెప్పినందుకు దళిత యువకుడ్ని పోలీసులను పంపించి మరీ వేధించడం ఎంతవరకు కరెక్టు? వాంగ్మూలం ఇచ్చిన రోజే ఆ దళిత యువకుడి కుటుంబంపైకి పోలీసులు, టీడీపీ కార్యకర్తలు వెళ్లి వారిని బెదిరించి, భయపెట్టడం కరెక్టేనా? ఇది ప్రజాస్వామ్య ప్రభుత్వమేనా? మీ కక్షలు తీర్చుకోవడానికి ఇన్నిరకాలుగా వ్యవస్థలను వాడుకుని దుర్మార్గాలు చేస్తారా?' అని జగన్ ప్రశ్నించారు. మీదే బాధ్యత.. 'సుప్రీంకోర్టు దృష్టిలో ఉన్న ఈ కేసులో.. వారి ఆదేశాలను అనుసరించి దిగువ కోర్టు క్షుణ్ణంగా కేసును విచారిస్తున్నాయి. పెట్టింది తప్పుడు కేసంటూ వాస్తవాలు బయటకు వస్తుంటే.. మొత్తం దర్యాప్తును, విచారణను, చివరకు జడ్జిని, న్యాయ ప్రక్రియను అపహాస్యం చేస్తున్నారు. అధికారముందనే అహంకారంతో మీరు చేస్తున్నది అరాచకం కాదా ఇది? అధికార దుర్వినియోగం కాదా? వంశీ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నాను. వంశీ భద్రతకు ఎలాంటి సమస్య వచ్చినా ఈ ప్రభుత్వమే పూర్తిగా బాధ్యత వహించాల్సి ఉంటుంది' అని జగన్ స్పష్టం చేశారు. బాధితులపైన కేసులా.. 'దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరిపై తప్పుడు కేసును తీవ్రంగా ఖండిస్తున్నాను. కళ్యాణ మండపం ప్రాంగణంలో అబ్బయ్య చౌదరి డ్రైవర్‌ను టీడీపీ ఎమ్మెల్యే బూతులు తిట్టారు. తిరిగి అబ్బయ్య చౌదరిపై ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టడం దుర్మార్గం. టీడీపీ ఎమ్మెల్యే ఏం తిట్టారో ఆ వీడియోను కోట్లమంది ప్రజలు చూశారు. మరి ఎవరిపై చర్యలు తీసుకోవాలి? తప్పులు టీడీపీ వారు చేసి, వారిపై చర్య తీసుకోమని కోరితే.. పోలీసులు ఎదురు కేసులు పెట్టి అన్యాయంగా వ్యవహరిస్తున్నారు. అందులోనూ 307, అంటే హత్యాయత్నం కేసులు పెట్టడం ఏంటి? అందులోనూ బాధితులపైన. రాష్ట్రంలో దిగజారిన వ్యవస్థలకు ఈ ఘటన నిదర్శనం కాదా?' అని జగన్ నిలదీశారు. ప్రజల డైరీల్లో రికార్డు.. 'చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన సూపర్-6, సహా ఇచ్చిన 143 హామీలు నిలబెట్టుకోలేక.. ఒక్కదాన్నీ కూడా అమలు చేయక, అంతకుముందున్న పథకాలను సైతం రద్దుచేసి, ప్రజలను సంక్షోభంలోకి నెట్టారు. ప్రజల దృష్టిని మళ్లించడానికి మా పార్టీకి చెందిన నాయకులను, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని తప్పుడు కేసులు, తప్పుడు సాక్షులతో అక్రమ అరెస్టులకు దిగుతున్నారు. మీ తప్పులను ప్రజలే తమ డైరీల్లో రికార్డు చేసుకుంటూనే ఉన్నారు. తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరిస్తున్నాం' అని జగన్ ట్వీట్ చేశారు.

## వీహెచ్ కోసం పెద్ద పదవి : సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం

మొదటి పేజి తరువాయి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిసైడ్ అయినట్లు చెబుతున్నారు. / తెలంగాణ కాంగ్రెస్ లో వీహెచ్ చాలా సీనియర్. పార్టీ అధిష్టానానికి వీర విధేయుడు. ఎన్ని ఒడిదుడుకులు ఎదుర్కొన్నా వీహెచ్ మాత్రం పార్టీని కంటికి రెప్పలా కాపాడుకుంటూనే వస్తున్నారు. ఇక వయసు రీత్యా ప్రత్యక్ష ఎన్నికల్లో తలపడలేకపోయిన ఆయన నామినేటెడ్ పదవిపై ఆశ పెట్టుకున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు దూరంగా ఉన్నా, పార్లమెంట్ ఎన్నికల్లో పోటీకి ఉవ్విళ్లూరారు. అయితే ఆయనకు వయోభారం ఉండటంతో అధిష్టానం పక్కనపెట్టింది. అప్పట్లోనే నామినేటెడ్ పదవి ఇస్తామని హామీ ఇచ్చింది. ఆ తర్వాత ఆయనకు బీసీ కమిషన్ పదవి ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పగా, వీహెచ్ ఆ పదవికి నిరాకరించారు. బీసీ కమిషన్ అంటే రాజ్యాంగ పదవి అవుతుందని, ఆ పదవిలో రాజకీయాలకు దూరంగా ఉండాల్సివస్తుందన్న ఆలోచనతో వీహెచ్ వద్దనుకున్నారని చెబుతున్నారు. దీంతో ఆయనకు ఏ పదవి ఇవ్వాలన్నదానిపై కాంగ్రెస్ అధిష్ఠానం తర్జనభర్జన పడిందంటున్నారు. అయితే ఎట్టకేలకు వీహెచ్ పదవిపై కాంగ్రెస్ కు క్లారిటీ వచ్చింది. మరో రెండు నెలల్లో శాసనమండలి చైర్మన్ పదవి ఖాళీ అవుతోంది. క్యాబినెట్ హోదా ఉండే ఆ పదవిని వీహెచ్ కు కేటాయించాలని సీఎం రేవంత్ రెడ్డి భావిస్తున్నట్లు తెలుస్తోంది. త్వరలో జరగబోయే ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో వీహెచ్ ను ఎమ్మెల్సీ చేసి, అనంతరం శాసనమండలి చైర్మన్ చేయాలని సీఎం ఆలోచనగా చెబుతున్నారు. దీనికి వీహెచ్ కూడా సంసిద్ధత వ్యక్తం చేసినట్లు చెబుతున్నారు. ఈ పదవితోపాటు పార్టీలోనూ వీహెచ్ కు తగిన గౌరవం ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం. కాంగ్రెస్ పార్టీ ఓబీసీ విభాగం జాతీయ చైర్మన్ పదవిని కూడా వీహెచ్ కు ఇచ్చే ఆలోచనలో కాంగ్రెస్ అధిష్టానం ఉందంటున్నారు. కులగణనపై కాంగ్రెస్ హైకమాండ్ ఎక్కువ ఫోకస్ చేస్తోంది. బీసీ రిజర్వేషన్లు పెంచాలనే విషయమై ఆ పార్టీ విధానంగా చెబుతున్నారు. అయితే కేంద్రంలో అధికారం లేకపోవడంతో కాంగ్రెస్ ఆలోచనకు కార్యరూపం దాల్చడంలేదు. జనాభాలో ఎక్కువగా ఉన్న బీసీలకు రాజకీయ ప్రాధాన్యం పెరగాలని ఆశిస్తున్న కాంగ్రెస్ పార్టీ పరంగా కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. తెలంగాణలో కులగణన పూర్తి చేసినందున.. రాష్ట్రంలో బీసీ నాయకత్వాన్ని ప్రోత్సహించాలని భావిస్తోంది. ఇందులోభాగంగా వీహెచ్ తోపాటు మిగతా బీసీ నేతలకు త్వరలో పదవులు వరించే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

## నీళ్ల కోసం మరో పోరాటానికి సిద్ధమవుదాం.. కేసీఆర్ ఆకాంక్షను నెరవేర్చుదాం : హరీశ్‌రావు

మొదటి పేజి తరువాయి

పథకాల పనులు ప్రశ్నార్థకంగా మారిన నేపథ్యంలో అనుసరించాల్సిన కార్యాచరణపై శుక్రవారం సంగారెడ్డి జిల్లా ముఖ్య నాయకులతో కోకాపేట లోని తన నివాసంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు సునీతా లక్ష్మారెడ్డి, చింతా ప్రభాకర్, మాణిక్ రావు, మాజీ ఎమ్మెల్యేలు భూపాల్ రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ శివ కుమార్, మాజీ జెడ్పీ చైర్మన్ జైపాల్ రెడ్డి, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు త్వరలో చేసే పోరాటం గురించి ఈ సమావేశంలో చర్చించారు. సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టు పనులను వెంటనే పూర్తి చేయాలనే డిమాండ్‌తో, ఆ ప్రాజెక్టుల నిర్దేశిత ఆయకట్టు ప్రాంతాల్లో బీఆర్ఎస్ పార్టీ నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నారు.

రెండేళ్ల క్రితం 2022 ఫిబ్రవరి 21న నారాయణ్ ఖేడ్‌లో అప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ ఈ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. అధికారంలోకి వచ్చి 14నెలలు గడుస్తున్నా కాంగ్రెస్ పార్టీ ఆ ప్రాజెక్టుల వైపు తొంగి కూడా చూడలేదు. దీంతో సంగారెడ్డి జిల్లా నారాయణ్ ఖేడ్, ఆందోల్, సంగారెడ్డి, జహీరాబాద్ నియోజకవర్గ ప్రజల సాగు నీరు కలగానే మారింది. దీంతో ప్రభుత్వంలో కదలిక తెచ్చి, ప్రాజెక్టులు పూర్తి చేయించి, దాదాపు 4 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించేందుకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సంగమేశ్వర, బసవేశ్వర సాగునీటి ప్రాజెక్టులపై పోరాటానికి సిద్ధం అవుదామని పిలుపునిచ్చారు. ఆ దిశగా సంసిద్ధం కావాలని సూచించారు.

## సెక్రటేరియట్‌లో ఊడిన పెచ్చులు.. మంత్రి కోమటిరెడ్డి కీలక వ్యాఖ్యలు

మొదటి పేజి తరువాయి



ఈ విషయమై శుక్రవారం (ఫిబ్రవరి 14) కోమటిరెడ్డి మీడియాతో మాట్లాడారు. రెయిలింగ్ ఊడిన ఘటనపై విచారణ చేయాలని ఆర్అండ్‌బీ ప్రిన్సిపల్ సెక్రటరీని ఆదేశించినట్లు తెలిపారు.విచారణ నివేదిక వచ్చాక అసలు విషయం ఏంటనేది తెలియజేస్తాం.ప్రభుత్వానికి రీజినల్ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్) లాంటి ప్రధానమైన పనులు చాలా ఉన్నాయి.పెచ్చులు ఊడటం చిన్న విషయం..ఆ అంశాన్ని అధికారులు చూసుకుంటారు'అని కోమటిరెడ్డి పేర్కొన్నారు.కాగా, ఇటీవల తెలంగాణ సచివాలయంలో పీవోపీ పార్టిషన్ స్వల్పంగా కూలింది. పెచ్చులు ఊడిపడ్డాయి. సీఎం ఛాంబర్ అంతస్తులో పెచ్చులు ఒక్కసారిగా ఊడిపడి కింద ఉన్న రామగుండం మార్కెట్ కమిటీ ఛైర్మన్ కారుపై పడ్డాయి. కారులో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. పెచ్చులు ఊడిపడడంతో ఉద్యోగులు ఆందోళన చెందారు. పీఓపీ పెచ్చులు ఊడి పడటంతో అధికారులు, భద్రతా సిబ్బంది అప్రమత్తం అయ్యారు. ఇటీవలే కొత్తగా నిర్మించిన తెలంగాణ సచివాలయం పీఓపీ కూలడం చర్చనీయాంశంగా మారింది. సచివాలయ నిర్మాణ లోపాలపై చర్చ జరుగుతోంది.

జనం రిపోర్టర్ తెలుగు దినపత్రిక
శనివారం - 15- ఫిబ్రవరి-2025

## ఆల్ ఇండియా "సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్" కి సహకార శాఖ ఉద్యోగి మాటూరి రాజేష్ ఎంపిక.

కరీంనగర్,(జనం రిపోర్టర్ ):సహకార శాఖ ములుగు జిల్లాలో "సీనియర్ ఇన్స్పెక్టర్"గా విధులు నిర్వహిస్తున్న కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ వాసి మాటూరి రాజేష్ ఈనెల 15వ తేదీ నుండి 28వ తేదీ



వరకు కాకినాడలో జరిగే ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ కు ఎంపికైనట్టుగా, తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.గతంలో వీరు బెంగళూరు,కురుక్షేత్ర, చండీగఢ్, రాంచి,రాయపూర్, భోపాల్, భువనేశ్వర్ లో నిర్వహించిన హాకీ టోర్నమెంట్ లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి పలువురి ప్రశంసలు పొందారు.మాటూరి రాజేష్ ఎన్నిక పట్ల ములుగు జిల్లా సహకార అధికారి సర్దార్ సింగ్ మాలోత్,సహకార శాఖ సిబ్బంది.,హుజురాబాద్ హాకీ క్లబ్ అధ్యక్షులు కొలిపాక శ్రీనివాసు, సెక్రటరీ ఉమామహేశ్వర్,తోట రాజేంద్రప్రసాద్, గుడ్డెలుగుల సమ్మయ్య, బండ శ్రీనివాస్, చింత శ్రీనివాస్, భూసారపు శంకర్ శ్రీనివాసు, రవికుమార్,యూసుఫ్, సజ్జు బండ రఘు,సురేష్,శ్యామ్, బిక్షపతి,తిరుపతి, కుమారు, సాయి కృష్ణ,ప్రదీప్, రాజేషు,విక్రం,సాంబ,వినయ్,వేణు,స్నేహితులు కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

## సంజీవయ్య రాష్ట్ర అభివృద్ధి కోసం అవిశ్రాంతంగా కృషి జె. వెంకట మురళి





బాపట్ల జిల్లా (జనం రిపోర్టర్ ):బాపట్ల, దామోదరం సంజీవయ్య సేవలను ప్రతి ఒక్కరు గుర్తుంచు కోవాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి అన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లో మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య 105వ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి జిల్లా కలెక్టర్ ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సంజీవయ్య 1960 జనవరి 11న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఎన్నికయ్యారన్నారు. ఇది ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఒక గొప్ప సంఘటన అని ఆయన చెప్పారు. ముఖ్యమంత్రిగా సంజీవయ్య రాష్ట్ర అభివృద్ధి కోసం అవిశ్రాంతంగా కృషి చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి చేశారని ఆయన అన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి. గంగాధర్ గౌడ్, జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి రాజ్ దిబోరా, జిల్లావెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి శివలీల, జిల్లా వైద్య ఆరోగ్య శాఖఅధికారి డాక్టర్ విజయమ్మ , బాపట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి పి.గ్లోరియా, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగ్ రక్షక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిన్నారి వీక్ష పుట్టినరోజు సందర్భంగా నిరుపేదలకు భోజనం పంపిణీ



పొదిలి (జనం రిపోర్టర్ ):ఈ రోజు ప్రకాశం జిల్లా ఒంగోలు వాస్తవ్యులు,హోప్ ఫౌండేషన్ అడ్మిన్ శ్రీ మోటుపల్లి దత్తాత్రేయ గారి దంపతులు వారి పాప చిన్నారి వీక్ష పుట్టినరోజు సందర్భంగా వారి కుటుంబ సభ్యులు నిరుపేదలకు భోజనం అందజేయాలన్న మంచి ఉద్దేశంతో హోప్ హెల్పింగ్ హాండ్స్ వారి ద్వారా దివ్యాంగ్ రక్షక్ ఫౌండేషన్ వారికి భోజనం అందజేయడం జరిగింది ఈ భోజనాన్ని దివ్యాంగ్ రక్షక్ ఫౌండేషన్ మరియు హోప్ హెల్పింగ్ హాండ్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈరోజు పుట్టినరోజు జరుపుకుంటున్న చిన్నారి బిక్ష పాప పేరు మీద పొదిలి కాలేజీ రోడ్డులోని తిరుగుతున్న నిరుపేదలకు భోజనం పంపిణీ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ఫౌండర్ నరసింహారావు, ఆంజనేయులు, బ్రహ్మారెడ్డి, శ్రీను, రాధా తదితరులు పాల్గొన్నారు.

## తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య

### జిల్లా ఎస్పీ తుషార్ దూడి



బాపట్ల జిల్లా (జనం రిపోర్టర్ ):జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో తొలి దళిత ముఖ్యమంత్రి శ్రీ దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించిన జిల్లా ఎస్పీ తుషార్ దూడిదామోదరం సంజీవయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించిన ఎస్పీతెలుగు జాతి గర్వించదగ్గ మహనీయుడు దామోదరం సంజీవయ్య అని జిల్లా ఎస్పీ తుషార్ దూడి కొనియాడారు. తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య 104వ జయంతి సందర్భంగా శుక్రవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యలయంలో అయన చిత్రపటానికి జిల్లా ఎస్పీ పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం దామోదరం సంజీవయ్య విద్యాభ్యాసం, నిస్వార్ధ రాజకీయ జీవితం గురించి పోలీస్ సిబ్బందికి వివరించారు. మిఠాయిలు పంచి సంజీవయ్య జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ కర్నూలు నగరంలో నేడు అంతర్భాగంగా ఉన్న కల్లూరు మండలం పెద్దపాడు గ్రామంలో ఓ సామాన్య నిరుపేద దళిత కుటుంబంలో మునెయ్య, సుంకలమ్మ దంపతులకు 1921 ఫిబ్రవరి 14న దామోదరం సంజీవయ్య జన్మించారని తెలిపారు. స్వగ్రామంలో 4వ తరగతి వరకు చదివి కర్నూలులోని అమెరికన్ బాప్టిస్ట్ మిషనరీ పాఠశాలలో విద్యను అభ్యసించి, కర్నూలు మున్సిపాలిటి ఉన్నత పాఠశాలలో చేరి 1938 లో %ూ.ా.ా.జ% (ఎస్.ఎస్.ఎల్.సి) జిల్లాలోనే ప్రథమునిగా ఉత్తీర్ణుడయ్యాడన్నారు. సంజీవయ్యకు చదువు పట్ల అమిత ఆసక్తిని గుర్తించిన కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో సంజీవయ్య చదువులో ఒక్కో మెట్టు ఎక్కుతు మద్రాస్‌లో న్యాయవిద్యను అభ్యసించారాని తెలిపారు. పిన్న వయస్సులోనే రాజకీయాలలోకి ప్రవేశించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ క్యాబినెట్ లలో పలు మంత్రిపదవులు చేపట్టారన్నారు. 38 సంవత్సరాల పిన్న వయసులో ముఖ్యమంత్రి అయిన ఘనత ఈయనకే దక్కిందన్నారు. 1960లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెండవ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తొలి దళిత ముఖ్యమంత్రి గా కీర్తినీ ఆర్జించారని తెలిపారు. రెండుసార్లు అఖిల భారత కాంగ్రెస్ కమిటి అధ్యక్ష బాధ్యతలు నిర్వర్తించిన నిస్వార్ధ రాజకీయ నాయకుడు సంజీవయ్య అని తెలిపారు. తెలుగు జాతి గర్వించదగ్గ మహనీయుడు శ్రీ దామోదరం సంజీవయ్య ఇలాంటి మహనీయుల వేడుకలను జరుపుకోవడం సంతోషంగా ఉందని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్, ఏ.ఓ శ్రీనివాసరావు, ఏ.ఆర్ డిఎస్పీ విజయసారధి, ఎస్.బి ఇన్స్పెక్టర్ నారాయణ, ఆర్.ఐ మౌలుద్దీన్ డిపిఓ లో విధులు నిర్వహించే వివిధ విభాగాల పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## భూగర్భ జలాల పెరుగుదలకు అంగన్వాడి కేంద్రాల వద్ద ఇంకుడు గుంతలు నిర్మించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి





బాపట్ల జిల్లా (జనం రిపోర్టర్ ): భూగర్భ జలాల పెరుగుదలకు అంగన్వాడి కేంద్రాల వద్ద ఇంకుడు గుంతలు నిర్మించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. భూగర్భ జలాల పెరుగుదలపై సంబంధిత శాఖల అధికారులతో గురువారం స్థానిక కలెక్టరేట్ లో ఆయన సమావేశం నిర్వహించారు .జలవనరులను సంరక్షించడానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని కలెక్టర్ చెప్పారు. వర్షపునీటిని ఒడిసిపట్టేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ప్రభుత్వ భవనాలపై కురిసే వర్షపు నీరు నేరుగా భూమిలోకి వెళ్లేలా ఇంకుడు గుంతలు నిర్మించాలన్నారు. ప్రజా ప్రయోజనం కొరకు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అధికారులు చేరుకోవాలన్నారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడిచే ప్రతి అంగన్వాడి కేంద్రం వద్ద ఇంకుడు గుంతలు నిర్మించాలన్నారు. అంగన్వాడి కేంద్రాల వద్ద ఇంకుడు గుంతలు నిర్మించడానికి ప్రభుత్వం నిధులను విడుదల చేసిందన్నారు. ఒక్కొక్క ఇంకుడు గుంత నిర్మించడానికి రూ.16,000లు చొప్పున ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. జిల్లాలో ఎంపిక చేసిన 261 అంగన్వాడి కేంద్రాల వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలన్నారు. వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ నిబంధనలు అనుసరించి పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారులు యుద్ధ ప్రాతిపదికన ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. 256 గ్రామాలలో ఈ కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పిడి ఉమా, పంచాయతీరాజ్ ఇంచార్జి ఎస్ఈ జి రత్నబాబు, ఇంజినీరింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కంఠమేశ్వర ఉత్సవాలకు హాజరైన మోకుదెబ్బ రమేష్ గౌడ్



వరంగల్(జనం రిపోర్టర్ ):నర్సంపేట మండలం ముతోజిపేట గ్రామంలో గౌడ కులస్తుల ఆరాధ్య దేవుడైన శ్రీ కంఠమేశ్వర స్వామి పండుగ ఉత్సవాలు నూతన ఆలయంలో శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ ఉత్సవాలకు గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్ హాజరు కావడం జరిగింది. ఈ సందర్భంగా రమేష్ గౌడ్ మాట్లాడుతూ నాలుగు రోజుల పాటు జరిగే ఉత్సవాలలో భాగంగా ప్రతి ఇంటి నుండి కుటుంబ సభ్యులతో పాటు బంధువులు నూతన విగ్రహాలను శ్రీ కంఠమేశ్వరుని ఆలయానికి ఊరేగింపుగా తరలి రావడం జరిగిందన్నారు.ఆలయంలో పూజారులు గణపతి పూజ అనంతరం పురుషులకు మాలదారణ చేయడం జరిగిందన్నారు.మాలదారణ అనంతరం కుటుంబ సభ్యులతో హోమం జరిపించడం జరిగిందని పేర్కొన్నారు.రెండో రోజు శ్రీ కంఠ మహేశ్వర స్వామి, సరమాంబదేవి, రేణుక ఎల్లమ్మ దేవి, వనం మైసమ్మ విగ్రహాల ప్రతిష్టాపన, మూడోరోజు జాలాభిషేకం, సోమవారం బోనాల కార్యక్రమం, మంగళవారం వనభోజనాల కార్యక్రమం ఉంటుందని రమేష్ గౌడ్ వివరించారు. ఈ కార్యక్రమంలో ముతోజీపేట గౌడ సంఘం అధ్యక్షులు మండ కుమారస్వామి గౌడ్, ప్రధాన కార్యదర్శి పోశాల రాంబాబు గౌడ్, బొట్టు పెద్ద మనిషి వేముల చిన్న సాంబయ్య గౌడ్, విగ్రహాల దాత మండ రాజు గౌడ్,మండ మహేందర్ గౌడ్, బూర సుమన్ గౌడ్, వేముల నవీన్ గౌడ్,తాళ్లపెల్లి రాంప్రసాద్ గౌడ్,మేరుగు రవి గౌడ్,దుపటిబాబు గౌడ్,పోశాల లక్ష్మినారాయణ గౌడ్, దుపటి మల్లయ్య గౌడ్,కుమార్ గౌడ్, కనుకయ్య గౌడ్, గాదగోని శ్రీనివాస్ గౌడ్, దుపటి చేరాలు గౌడ్,సుదర్శన్ గౌడ్, అశోక్ గౌడ్, దుపటిగాంధీ గౌడ్, బుచ్చిరాములు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మణిపూర్ లో రాష్ట్రపతి పాలన మోదీ వైఫల్యమే:



పొన్నూరు (జనం రిపోర్టర్ ):మణిపూర్ ముఖ్యమంత్రి బీరెన్ సింగ్ రాజీనామా తదనంతర పరిస్థితులు రాష్ట్రంలో రాష్ట్రపతి పాలనకు దారితీయటం ప్రజాస్వామ్య వ్యవస్థను అపహాస్యం చేయటమే అని గత కొన్ని నెలలుగా మణిపూర్ రాష్ట్రం పై బిజెపి అప్రజాస్వామికంగా వ్యవహరిస్తుందని తాజా ఘటన పాలనా పరంగా బిజెపి ప్రభుత్వ, నాయకత్వ పరంగా మోదీ వైఫల్యమని పొన్నూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అందే దిలీప్ అన్నారు. మణిపూర్ లో రాష్ట్రపతి పాలన విధిస్తు గత రాత్రి కేంద్ర ప్రభుత్వం ప్రకటించడాన్ని తప్పుబడుతూ శుక్రవారం ఆయన స్వగృహంలో ఏర్పాటుచేసిన సమావేశంలో దిలీప్ ఆరోపించారు.బిజెపి పక్షపాత ధోరణితోనే మణిపూర్ లో అల్లర్లు చెలరేగాయని కొన్ని శతాబ్దాలుగా భారతావని ఎరుగని హింసాత్మక ఘటనలతో మణిపూర్ అతలాకుతలం అయ్యిందన్నారు.బిజెపి ప్రేరేపిత హింసకు వందలాది మంది మరణించారని వేలాది మహిళపై అకృత్యాలు జరిగాయని లక్షలాది మంది నిరాశ్రయులయ్యారని పేర్కొన్నారు. చరిత్ర చూడని హింస చోటుచేసుకున్నా ప్రధాని ఈరోజుకి ఒక్క మాట మాట్లాడలేదని ఇది ముమ్మాటికీ గోద్రా ను మించిన హింసని రెండు హింసలకు సూత్రదారులు మో - షా, ఆర్.ఎస్.ఎస్ రాజ్యాంగం బిజెపి ప్రభుత్వం, మోదీ-అమిత్ షా ల నాయకత్వం దేశంలో ప్రతిచోటా విభజన రేఖల్ని గీస్తుందని ఇది ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అన్నారు. దేశ మనుగడను ప్రశ్నర్ధకం చేస్తున్న వీరిని ప్రజలు దూరంగా పెట్టిననాడే భావితరాలకు భవిష్యత్తు"లి అని దుయ్యబట్టారు.

## నవ్యాంధ్ర దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో దివ్యాంగుల మరియు వృద్ధాశ్రమం ప్రారంభోత్సవ వేడుకలు



పొదిలి(జనం రిపోర్టర్ ):నవ్యాంధ్ర దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న విషయం తెలిసిందే ఈ కార్యక్రమంలో ముందడుగు వేయడం జరిగింది దివ్యాంగుల మరియు వృద్ధాశ్రమం ఈరోజు ప్రకాశం జిల్లా పొదిలి మండలం రాజీవ్ నగర్ కాలనీ లో ఫౌండర్ నరసింహారావు మరియు రాష్ట్ర అధ్యక్షుడు ఆంజనేయులు మరియు ప్రధాన కార్యదర్శి బ్రహ్మా రెడ్డి గారి ఆధ్వర్యంలో స్టార్ట్ చేయడం జరిగింది స్టార్ట్ చేసిన వెంటనే నలుగురు వృద్ధులను కూడా చేర్చుకోవడం జరిగింది దీని సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు ఆంజనేయులు మాట్లాడుతూ ఆశ్రమం ప్రారంభించాలని ఎన్నో సంవత్సరం నుండి అనుకుంటున్నానని హోప్ హెల్పింగ్ హాండ్స్ ఫౌండేషన్ వారి సహకారంతో ఈరోజు ఈ ఆశ్రమం నా చేతుల మీద ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని తెలియజేయడం జరిగింది ఈ వృద్ధాశ్రమంలో చేరిన వారు కూడా ఎక్కడో దూరంగా ఆశ్రమాలు ఉన్నాయని పొదిలి అనుకొని రాజీవ్ నగర్ కాలనీలో మా కోసం ఆశ్రమం పెట్టడం చాలా సంతోషంగా ఉందని వారి అభిప్రాయం కూడా వ్యక్తం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ఫౌండర్ నరసింహారావు, రాష్ట్ర అధ్యక్షుడు ఆంజనేయులు ,ప్రధాన కార్యదర్శి బ్రహ్మా రెడ్డి, కోశాధికారి రాధా, శ్రీను, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో కష్టపడి పని చేసి కాంగ్రెస్ గెలుపుకు కృషి చేయాలి

### కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు మల్లు సిద్దు



నర్వ వనపర్తి జిల్లా ప్రతినిధి(జనం రిపోర్టర్ ):రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేయాలని పార్లమెంట్ సభ్యులు మల్లు రవి కుమారుడు రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మల్లు సిద్దు అన్నారు. హైదరాబాద్ లో మల్లు రవి పెద్దలు తెలంగాణ రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ , నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు కుమారుడు మల్లు సిద్దు ను ఒక్క నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు రాష్ట్ర ఎంపిటిసిల సంఘం జిల్లా వైస్ ప్రెసిడెంట్ మాజీ ఎంపిటిసి పసుల నీరజ్, నారాయణపేట సోషల్ మీడియా కోఆర్డినేటర్ లక్ష్మణ్ గౌడ్ మరియాదాపుర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సిద్దు ను శాలువాతో సబ్వాడించారు.సిద్దు మాట్లాడుతూరాబోయే పంచాయతీ, మండల పరిషత్ ఎన్నికల్లో కష్టపడి పని చేయాలని ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకుపోవాలని సూచించారు, పార్టీ కోసం పనిచేసిన వాళ్లకి ఖచ్చితంగా గుర్తింపు ఉంటుందని హామీ ఇచ్చారు.

## పలు కుటుంబాలను పరామర్శించిన వైసీపీ నేత అంబటి..





పొన్నూరు (జనం రిపోర్టర్ ):గుంటూరు జిల్లా పొన్నూరు మండలంలో శుక్రవారం పొన్నూరు నియోజకవర్గం వైఎస్ఆర్సిపి సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ పార్టీ శ్రేణులతో కలిసి పలు కుటుంబాలను పరామర్శించారు. తొలుత కట్టెంపూడి గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు యక్కటి కృష్ణ ఇటీవల మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న అంబటి మురళీకృష్ణ ఆయన కుటుంబాన్ని పరామర్శించి తన సానుభూతి తెలిపారు. మామిళ్ళపల్లి గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు భీమ నాయనమ్మ ఇటీవల మృతి చెందారు. భీమ గృహానికి వెళ్లి పరామర్శించి తన సానుభూతి తెలిపారు. కార్యక్రమాలలో వైఎస్ఆర్ సీపీ జిల్లా ఆర్గనైజేషన్ కమిటీ సెక్రటరీ ఆకుల వెంకటేశ్వరరావు, వైసీపీ నేత మాము, సర్పంచ్ శివ నాగులు, మాజీ సర్పంచ్ బుచ్చిరెడ్డి, అక్కిరెడ్డి, సూరిశెట్టి ప్రసాద్ ,సముద్రయ్య, అంబటి వెంకటేశ్వర్లు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## అటవీ సంరక్షణ పై అవగాహన సదస్సు.. పరిసర గ్రామల ప్రజలకు అవగాహన సదస్సులు

### అగ్ని ప్రమాదాల నివారణకు అధికారుల చర్యలు
### వన్య ప్రాణులను వేటాడితే కఠిన చర్యలు తీసుకుంటాం
### అడవులపై నిరంతరం నిఘా : అమరవరం రేంజర్




కుక్కునూరు కుక్కునూరు (జనం రిపోర్టర్ ):అమరవరం అటవీ రేంజ్ పరిధిలోని పరిసర గ్రామాల్లో అడవుల సంరక్షణపై అటవీశాఖ అధికారులు అవగాహన సదస్సులను ఏర్పాటు చేశారు. వేసవిలో అగ్ని ప్రమాదాల నుంచి అటవీ ప్రాంతాన్ని రక్షించుకొని, భావితరాలకు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అమరవరం అటవీ రేంజ్ అధికారిణి సత్య పద్మజ అన్నారు. రేంజ్ పరిధిలోని అమరవరం బీట్ పరిధిలోని దామరచర్ల, రేగులచెరువు అటవీ ప్రాంతాల్లో శుక్రవారం 'అటవీ రక్షణ-వన్యప్రాణుల సంరక్షణ, అడవి-నిప్పు నియంత్రణ'పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భూమి మీద ప్రాణాలతో ఉండే ప్రతి ప్రాణికి అటవీ ప్రాంతం కీలకమన్నారు. అడవి సస్యశ్యామలంగా ఉంటేనే అందరూ ఆరోగ్యంగా ఉంటారన్నారు. అందుకే అడవిని కాపాడుకోవడానికి అందరం సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అటవీ ప్రాంతంలో అన్ని రకాల వన్యప్రాణులు జీవించే విధంగా వాతావరణం అనుకూలంగా ఉందన్నారు. వన్యప్రాణులను వేటాడితే బాధ్యులైన వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. వేసవి కాలంలో అడవుల్లో తరచూ అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. వేసవిలో ఆకులు ఎండిపోయి నేలరాలుతాయి. ఎవరైనా నిప్పు పెడితే అడవులు మంటలు పెద్ద మొత్తంలో అంటుకుని అడవులకు నష్టం వాటినే ప్రమాదం ఉంది. దీంతో చెట్లు కాలిపోవడంతో పాటు అటవీ ప్రాంతంలో ఉండే వన్యప్రాణులకు సైతం ముప్పు వాటిల్లుతుంది.నష్టాన్ని తగ్గించాలంటే వన్య సంరక్షణపై ప్రజలందరిలో చైతన్యం రావాలని, అడవులను రక్షించడం మనందరి బాధ్యత అన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో బీట్ ఆఫీసర్ వెంకన్న బాబు, డిఆర్ఓలు అశోక్ కుమార్,జగదీష్, అటవీశాఖ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉప్పర సగర కులానికి అత్యధిక సీట్లు ఇవ్వాలి

### తెలంగాణ రాష్ట్ర ఉప్పర సగర సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు చిలుక సత్యం




అమరచింత వనపర్తి ప్రతినిధి (జనం రిపోర్టర్ ):రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సగర ఉప్పర కులానికి అత్యధిక సీట్లు కేటాయించాలని తెలంగాణ రాష్ట్ర సగర ఉప్పర సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు చిలుక సత్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం అమరచింత సగర ఉప్పర సంగం ఆధ్వర్యంలో పట్టణంలోని కాళికాదేవి మాత ఆలయం వద్ద జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సగరులను బిసి-డి గ్రూపు నుండి బిసి-ఏ లోకి మార్చాలని డిమాండ్ చేశారు. అలాగే సగర ఫెడరేషన్ రద్దుచేసి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బీసీలకు శాపంగా మారిన ఈ డబ్ల్యూ ఎస్ రిజర్వేషన్ ని రద్దు చేయాలని డిమాండ్ అనంతరం సగరుల సమక్షంలో బహిరంగ సభకు సంబంధించిన గోడ పత్రికలను విడుదల చేశారు. సగరులు ప్రతి ఒక్క మండల కమిటీలను ఎన్నుకొని తదనంతరం జిల్లా సగర సంగం ఎన్నికలు నిర్వహించుకొని ప్రతి ఒక్క సగర బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొని జిల్లా కమిటీని దిగ్విజయంగా పూర్తి చేయాలని కోరారు. ఈనెల 16న నాగర్ కర్నూల్ లో జరిగే భారీ బహిరంగ సభ కు సగరులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు స్వామి సాగర్ రాజ్ కుమార్, అమరచింత అధ్యక్షులు కే లక్ష్మీనారాయణ, కార్యదర్శి రాంసాగర్, జి బాలస్వామి కోశాధికారి ఏం సత్యనారాయణ, సహాయ కార్యదర్శి యుగంధర్, రామ చంద్రి, రామకృష్ణ, పెద్ద అంజి, సూగురు ఆనంద్ మిగతా సభ్యులు పాల్గొన్నారు.

## సమస్య ఉంటే మీ శ్రేయోభిలాషులకు తెలియజేయండి

## వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా





వరంగల్(జనం రిపోర్టర్ ):విధి నిర్వహణలో గాని లేదా ఏద్కైనా వ్యక్తిగత సమస్యలతో ఒత్తిళ్లకు గురౌవుతే తమ శ్రేయోభిలాషులకు లేదా తమ స్నేహితులకు తెలియజేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలియజేసారు. విధినిర్వహణతో పాటు వ్యక్తిగతంగా ఎదురయ్యే మానసిక ఒత్తిళ్లను నియంత్రించడం ఎలా అనే అంశంపై అవగాహన సదస్సు శుక్రవారం పోలీస్ కమిషనరేట్‌లోని రుద్రమదేవి ప్రాంగణంలో నిర్వహించారు. పోలీస్ కమిషనరేట్ కార్యాలయములో వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బందితో పాటు పరిపాలన విభాగం అధికారులు సిబ్బంది పాల్గోన్న ఈ సదస్సుకు వరంగల్ పోలీస్ కమిషనర్ ముఖ్య అతిధిగా పాల్గోన్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ పోలీస్ అధికారులను ఉద్యేశిస్తూ మాట్లాడుతూ నిరంతరం విధులు నిర్వహించే పోలీస్ ఉద్యోగులకు విధి నిర్వహణలో భాగంగా ఎన్నో పని ఒత్తిళ్లను ఎదుర్కోనాల్సి వుంటుందని, క్రమ శిక్షణ, ప్రణాళికాబద్దంగా విధులు నిర్వహించడంతో ద్వారా ఈ ఒత్తిళ్లను అధిగమించవచ్చని, వ్యక్తిగత కారణాలతో ఎదురయ్యే మానసి ఒత్తిళ్లు చాలా ప్రమాదకరమని కొన్ని సందర్భాల్లో ఈ ఒత్తిళ్ల కారణంగా ఆరోగ్య సమస్యలు ఎదుర్కోనాల్సి వుంటుందని కొన్ని సందర్భాల్లో ఒత్తిళ్లు తట్టుకోలేక క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాలతో కుటుంబ రోడ్డున పడుతుందని ముఖ్యంగా క్షణికావేశంలో తప్పుడు నిర్ణయాలు తీసుకునే ముందు మీ కుటుంబ గురించి ఆలోచించాలని ఒత్తిళు అధిగమించేందుకుగాను రోజు కొద్ది సేవు వ్యాయామం లేదా యోగకు సమయాన్ని కేటాయించాలని, మీ భావాలను ఇతరులతో పంచుకోండని, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు చేసుకోవడంతో పాటు, ఆరోగ్యానికి హానీ కలిగించే అలవాట్లకు దూరంగా వుండాలని వరంగల్ పోలీస్ కమిషనర్ పోలీసులకు సూచించారు. అంతకుముందుగా నగరానికి చెందిన మనస్తత్వవేత్తలు డా.జ్యోతి, స్వప్న, బెన్‌సన్‌లు మానసిక ఒత్తిళ్లను ఏవిధంగా నియంత్రించుకోవాలని పోలీస్ సిబ్బంది, అధికారులకు తెలియజేసారు. ఈ కార్యక్రమములో డిసిపిలు షేక్ సలీమా, రవీందర్, అదనపు డిసిపిలు రవి, సురేష్ కుమార్, ఏసిపిలు జితేందర్, మధసూధన్, నాగయ్య, అనంతయ్య, ఏఓ రామకృష్ణతో పాటు ఆర్.ఐలు, ఇన్స్‌స్పెక్టర్లు, ఆర్.ఎస్.ఐలు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గోన్నారు.



## బిజేపీలో చేరిన తెలుగు తమ్ముళ్లు......





గుడిబండ (జనం రిపోర్టర్ ):శ్రీ సత్య సాయి బిజెపి జిల్లా అధ్యక్షులు శేఖర్ స్వామి ఆధ్వర్యంలో శుక్రవారం బీజేపీ పార్టీ లో చేరిన,గుడిబండ లెజెండ్, టి డి పి సీనియర్ నాయకుడు జి బి సుధాకర్, శంకరగల్లు సర్పంచ్ నరేంద్రబాబు బిజెపి పార్టీలో చేరారు వీరికి ధర్మవరం ఎమ్మెల్యే వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ చేతుల మీదుగా బిజెపి పార్టీ కప్పి సాదరంగా ఆహ్వానించారు పార్టీ ఎదుగుదల కోసం మడకశిర నియోజకవర్గ వ్యాప్తంగా బిజెపి పార్టీ బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశ సంస్కృతి మరియు నాగరికత వెలువబడుతుందని మరియు పార్టీ కృషికి నేటి యువత దేశమంతా తహ తహ లాడుతుందని లెజెండ్ జి బి సుధాకర్ పేర్కొన్నారు. దేశంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి బిజెపి నాంది పలికిందని శంకరగల్లు సర్పంచ్ నరేంద్రబాబు కొనియాడారు.

## భద్రాచలంలో మరోసారి రామకోటి రామరాజుకు ఘన సన్మానం

### తెలంగాల రాష్ట్రం నుండి గజ్వేల్ లోని రామకోటి సంస్థకు అరుదైన గౌరవం



ఎటపాక (జనం రిపోర్టర్ ):భద్రాచలం: సీతారాముల కళ్యాణానికి గోటితో ఒలిచిన తలంబ్రాలు వాడడం ఆనవాయితీ. ఈ గోటి తలంబ్రాల దీక్షలో పాల్గొనేందుకు కొన్ని ధార్మిక సేవా సంస్థలకు చోటు కల్పించారు. అందులో తెలంగాణ రాష్ట్రం నుండి సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణానికి చెందిన శ్రీరామ కోటి భక్త సమాజం సంస్థకు ముచ్చటగా మూడోసారి చోటు దొరికింది. 250 కిలోల గోటి తలంబ్రాలకు (వడ్లకు) శుక్రవారం నాడు ప్రత్యేక పూజలు జరిపి రామకోటి రామరాజును దేవస్థానంలో ఘనంగా సన్మానించి వడ్లను అందజేసిన భద్రాచల దేవస్థానం ఏఈవో శ్రావణ్ కుమార్.ఈ సందర్భంగా మాట్లాడుతూ రామకోటి రామరాజు గత 26 సంవత్సరాలనుండి చేస్తున్న నిర్విరామ కృషి, పట్టుదల అమోఘం అన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ, గ్రామాన తిరిగి లక్షల మంది భక్తులచే రామనామ స్మరణ చేయించి ఒడ్లను గోటితో ఒలిపించి భక్తితో కళ్యాణానికి గత రెండు సార్లు అందించారని తెలిపారు.గోటి తలంబ్రాలు అందజేసే బృహత్తర కార్యక్రమం చేపట్టి పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారని రామ నామమే శాశ్వతమని రామ నామాన్ని లిఖింపజేస్తూ ప్రజలను భక్తిమార్గం వైపు పయనించే విధంగా ప్రయాణం సాగిస్తున్న రామకోటి రామరాజు అభినందనీయుడన్నారు. అనంతరం రామకోటి రామరాజు మాట్లాడుతూ భద్రాచలం ఆలయం వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ గోటి తలంబ్రాలు కార్యక్రమంలో మమ్మలని భాగస్వాములు చేయడం సంతోషంగా ఉందని మా గజ్వేల్ ప్రాంత భక్తుల కోరిక మేరకు 250 కిలోల వడ్లు తీసుకు వెళ్లడం జరుగుతుందని త్వరలోనే కోటి తలంబ్రాల దీక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరుగుతుందని అన్నారు.

## పేదలకు గ్రామాలలో 3 సెంట్లు పట్టణప్రాంతాల్లో 2 సెంట్లు స్థలాలు ఇవ్వాలి,పక్కాగృహాలు ప్రభుత్వమే నిర్మించాలి

### డి.చిన్నప్పయాదవ్



సింగనమల(జనం రిపోర్టర్ ): సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యులుఏపీ సీపీఐ రాష్ట్ర సమితి పిలుపుమేరకు పేదలకు ఇంటి స్థలాలు పక్కా గృహాలుప్రభుత్వము ద్వారా మంజూరు చేయాలని సిపిఐజిల్లాకార్యవర్గసభ్యులు డి చిన్నప్ప యాదవ్ ఆధ్వర్యంలో సింగనమల మండలం పి.జలాలుపురముగ్రామములో అర్జీల కార్యక్రమములోపాల్గొనడం జరిగింది.ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యులు డి.చిన్నప్పయాదవ్ మాట్లాడుతూ,గ్రామాలలో చాలామంది పేదలు స్థలాలు లేక ఇంటినిర్మాణినికి లబ్ధిదారుల దగ్గర నగదులేక ప్రభుత్వము ఇచ్చేనగదు మెత్తము సరిపోక, అనేకఇబ్బందులు ఎదుర్కోంటున్నారు ప్రభుత్వ యంత్రాంగం క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి లబ్ధిదారులకు గ్రామాలలో మూడు సెంట్లు పట్టణాలలో రెండు సెంట్లు ప్రకారం కాపురాలకు అనుగుణంగా ఉండే స్థలాలను ఎంపిక చేసి ప్రభుత్వ స్థలాలు కానీ ప్రైవేటు స్థలాలు కానీ గుర్తించి వారికి స్థలాలు ఇచ్చి ప్రభుత్వమే గృహ నిర్మాణానికి 5 లక్షలురూపాయలు కంకర ,సిమెంట్ ,ఇనుము వస్తువులను ఉచితంగా అందించాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ద్వారా డిమాండ్ చేస్తున్నాం.పాల్గోన్నవారు,రైతుసంఘము నీయోజకవర్గ అధ్యక్షులుమధుయాదవ్ చేనేత కార్మిక సంఘం మండల కార్యదర్శి చేనేత మధు, బూసప్ప, మంచాలనాగన్న, అంజినేయులుఆదిలక్ష్మి, తిరుపాలమ్మ,అమరావతీ, అశ్విని,కూమారి,నాగమ్మ, గంగాభవాని,భాగ్యమ్మ, వీరనాగప్ప తదితరులుపాల్గోనడమైనది.

## అదుపు తప్పి బావిలో పడ్డ కారు. .ఓ వ్యక్తి మృతి..మరొకరికి గాయాలు వ్యక్తి ప్రాణాలు కాపాడిన పోలీస్ సిబ్బంది



శింగనమల మండలం (జనం రిపోర్టర్ ):నాయనపల్లి క్రాస్ మరియు నడిమిదొడ్డి సమీపంలో కారు అదుపుతప్పి బావిలో పడటంతో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలైనట్లు సీఐ కౌలుట్లయ్య తెలియజేశారు.సీఐ తెలిపిన వివరాల మేరకు తాడిపత్రి నుండి నార్పల వైపు వెళుతున్న కారు ఆవు అడ్డు రావడంతో ఆవును తప్పించబోయి నడిమి దొడ్డి గ్రామ సమీపంలో రోడ్డు పక్కనే ఉన్న బావిలో పడిపోవడంతో కారులో ప్రయాణం చేస్తున్న అనంతపురం నగరంనకు చెందిన షాబుద్దీన్ (40)మృతి చెందగా, ఇర్ఫాన్ తీవ్రంగా గాయపడ్డాడు.ప్రమాదం జరిగిన వెంటనే పోలీస్ శాఖ సిబ్బంది స్పందించి కారును బయటకు తీసి వ్యక్తి ప్రాణాలను రక్షించడం జరిగింది.మృతులు అనంతపురం గుల్జార్ పేటకు చెందిన వారిగా గుర్తించినట్లు తెలియజేశారు.కారులో ప్రయాణిస్తున్న వారు ఇద్దరు కూడా జియో కంపెనీలో పనిచేస్తున్నట్లు తెలియజేశారు.సంఘటన స్థలానికి శింగనమల, నార్పల పోలీసులు,ఫైర్ స్టేషన్ సిబ్బంది,స్థానికుల సహాయంతో బావిలో పడ్డ కారును బయటికి తీశారు.సంఘటన స్థలాన్ని శింగనమల ఎస్సై విజయ్ కుమార్,నార్పల ఎస్సై సాగర్ పోలీస్ సిబ్బంది పరిశీలించారు.కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## అంకితభావంతో ముందుకు సాగుతాం





సింగనమల(జనం రిపోర్టర్ ):నేడు నా పుట్టినరోజున నా నాయకుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గారి ఆశీస్సులు పొందడం నా అదృష్టంగా భావిస్తున్నాను. ఈ ప్రత్యేక క్షణం నాకు కొత్త ఉత్సాహాన్ని, శక్తిని ఇచ్చింది. ఆయన ఆశీర్వాదంతో ప్రజాసేవలో మరింత అంకితభావంతో ముందుకు సాగుతాను.

## సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ



శింగనమల మండలంలోని (జనం రిపోర్టర్ ):బండమీదపల్లి గ్రామానికి దగ్గర వ్ సంబంధించిన తాడిపత్రి కి వెళ్లే 6 లైన్ల రోడ్డు పనులు జరుగుతున్న సమయంలో నీటి సరఫరా పైప్ లైన్ దెబ్బతింది. పైప్ లైన్ డామేజ్ వలన నీటి సరఫరా లేక నీటి ఎద్దడి ఏర్పడింది. ఇటీవల గ్రామస్తులు నీటి కోసం ఆందోళన చేశారు. ఈ విషయం తెలుసుకున్న నియోజవర్గ ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ అధికారులను గ్రామానికి పంపి, నీటి సరఫరా పైప్ లైన్ మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేసేందుకు, అలాగే తాత్కాలికంగా నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అంతేకాకుండా గ్రామంలోని ఇతర సమస్యలు కూడా పరిష్కారం చేస్తామని ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ తెలిపారు.

## వల్లభనేని వంశీమోహన్ అరెస్ట్ హర్షించదగ్గ విషయం:- కందుల వేణు వర్ధన్...



పొన్నూరు (జనం రిపోర్టర్ ):గన్నవరం మాజీ శాసనసభ్యులు వల్లభనేని వంశీమోహన్ అరెస్ట్ తో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమంతటా ఎంతో సంతోషంగా ఉన్నారని ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ ఐక్యవేదిక గుంటూరు జిల్లా ఉపాధ్యక్షులు, అఖిల భారత గౌడ సంఘం గుంటూరు జిల్లా యువత అధ్యక్షుడు, తెనాలి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నేత, పెదకాకాని మండలం తెలుగుదేశం పార్టీ నేత కందుల వేణు వర్ధన్ అన్నారు. శుక్రవారం తెనాలి మారిస్ పేట ఆయన నివాసం వద్ద కందుల వేణు వర్ధన్ మాట్లాడుతూ తనకు రాజకీయభిక్ష పెట్టిన తల్లి లాంటి తెలుగుదేశం పార్టీ కార్యాలయం పై దాడి చేయించాడని ఎన్టీఆర్ , చంద్రబాబు కుటుంబాలపై అనుచిత వ్యాఖ్యలకు తెగబడ్డాడని వంశీ పై కందుల ఆగ్రహం వ్యక్తం చేశారు. వంశీ లాంటి వారు సమాజంలో ఉండటానికి అసలు అనర్హులని మూడవ కంటికి తెలియకుండా నేరం చేయడంలో వంశీని మించినవారు రాష్ట్రంలోనే ఎవరు ఉండరని కందుల తెలిపారు. గన్నవరం టీడీపీ పార్టీ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ గా పని చేసే సత్యవర్ధన్ టీడీపీ కార్యాలయం పై దాడి జరిగినప్పుడు వంశీ అతని అనుచరులపై సత్యవర్ధన్ ఫిర్యాదు చేశాడని ఆ కేసులో అరెస్ట్ అవుతాననే భయంతో వంశీ సత్యవర్ధన్ ను బెదిరించి ఫిర్యాదు వెనక్కు తీసుకునేలా చేశాడని కందుల మండిపడ్డాడు. ఒక సాధారణ వ్యక్తిని బెదిరించి అతనిచ్చిన ఫిర్యాదును వెనక్కు తీసుకునేలా చేయవలసిన అవసరం ఏమి ఉన్నది అని కందుల ప్రశ్నించారు. వైసీపీ నేతల విషయంలో కూటమి ప్రభుత్వం చట్టప్రకారమే వ్యవహరిస్తుందని తప్పులు నేరాలు చేసిన వారు సమాజంలో తిరుగుతూ రెచ్చ గొడుతుంటే చట్టం చూస్తూ ఊరుకోదని కందుల హెచ్చరించారు. తెలుగుదేశం నాయకులును, కార్యకర్తలను ఇబ్బంది పెట్టినవారిని చట్ట ప్రకారం శిక్షిస్తామని నారా లోకేష్ గతంలో చెప్పారని కందుల వేణు వర్ధన్ స్పష్టం చేశారు.

## కాలుష్య రహిత జీవనశైలిని అలవాటు చేసుకోవాలి..



పొన్నూరు (జనం రిపోర్టర్ ):ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ కోర్ డైరెక్టర్ పి. స్రవంతి శుక్రవారం గుంటూరు జిల్లా పర్యటనలో భాగంగా పొన్నూరులోని శ్రీవేద, ఎన్.ఎన్.టి ,ఎ.పి.స్కూల్ లను సందర్శించి విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాల విద్యా వ్యవస్థలో పర్యావరణం సమస్యల పట్ల పూర్తి అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర మూడో శనివారం కార్యక్రమాన్ని పాఠశాలల్లో ఎకో క్లబ్ ల ఆధ్వర్యంలో విస్తృతంగా చేపట్టాలని ఆమె సూచించారు. పాఠశాలలో చెట్ల పెంపకం చేపట్టడం ద్వారా విద్యార్థులు తమ పరిసరాలను పచ్చగా , పరిశుభ్రంగా ఉంచడానికి ప్రేరేపించాలని అన్నారు. నీటి వినియోగాన్ని ఆప్టిమైజ్ చేయడం ద్వారా నీటి సంరక్షణ యొక్క తత్వాన్ని ప్రోత్సహించాలన్నారు .విద్యార్థులు తమ పరిసరాలను పచ్చగా, శుభ్రంగా ఉంచుకోవడానికి పాఠశాలలో పర్యావరణ సమస్యలపై సెమినార్లు, చర్చలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కాలుష్య రహిత జీవనశైలిని విద్యార్థులు అలవాటు చేసుకోవాలని సూచించారు.శ్వాసకోశ వ్యాధులకు కారణమయ్యే వ్యర్థాలను విచక్షణారహితంగా కాల్చడాన్ని ఆపడానికి, ప్రజా పారిశుధ్య కార్మికులలో అవగాహన కల్పించడానికి విద్యార్థులు ముందుండాలన్నారు. ప్లాస్టిక్ సంచుల వాడకాన్ని తగ్గించడానికి, బహిరంగ ప్రదేశాల్లో వాటిని విసిరేయకుండా, అవి మురుగునీటి కాలువలు మురుగు కాలువలను మూసివేసి, నీరు నిలిచిపోవడానికి దోమలకు వృద్ధినిచ్చేలా చేయడం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు .లౌడ్ స్పీకర్ల వాడకానికి వ్యతిరేకంగా ప్రచారం, క్రాకర్లు , బాణసంచా తయారీని ఉపయోగించకుండా విద్యార్థులను ప్రేరేపించాలన్నారు. పర్యావరణపరంగా ముఖ్యమైన ప్రదేశాలకు క్షేత్ర సందర్శన చేయాలని అన్నారు. పర్యావరణ అవగాహనను వ్యాప్తి చేసే ఉద్దేశ్యంతో బహిరంగ ప్రదేశాలలో ర్యాలీలు, కవాతులు, మానవ హారాలని నిర్వహించాలని అన్నారు. పాఠశాల ప్రాంగణం లోపల , వెలుపల చెట్ల పెంపకం, శుభ్రత కార్యక్రమాలతో పాటుగా కిచెన్ గార్డెన్‌లను పెంచడం, క్రిమికీటక కంపోస్టింగ్ గుంటలను నిర్వహించడం, పాఠశాలలో నీటి సేకరణ నిర్మాణాలను నిర్మించడం, కాగితం రీసైక్లింగ్ వారికి ఇవ్వడం మొదలైనవి చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండలవిద్యాశాఖాధికారి శ్రీనివాసరెడ్డి, జిల్లా సైన్స్ అధికారి షేక్ గౌసుల్ మీరా, ప్రాజెక్ట్ ఆఫీసర్ సత్యనారాయణ, అప్పారావు, శివకుమార్, శ్రీనివాసరావు, ప్రసాద్ , పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## సి ఎం రిలీఫ్ ఫండ్ రూ 2,25,639 /- పంపిణీ



రేపల్లె(జనం రిపోర్టర్ ):ఎవరు అనారోగ్యంతో మృతి చెందకూడదని ఇబ్బందులు పడకూడదని ఇబ్బందుల్లో ఉన్న వారికి ముఖ్యమంత్రి సహాయనిధి నుండి అందజేస్తున్నారని రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్ మరియు స్టాంపుల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరుడు శివప్రసాద్ తెలియజేశారు శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తులకు సీఎం రిలీఫ్ ఫండ్ రూ 2,25,639 విలువ కలిగిన యువకులను పంపిణీ చేశారు ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఎందరో వ్యాధిగ్రస్తులకు చేయూతను అందించడం జరుగుతుందని అందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ధన్యవాదాలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో పంతాన్ని మురళీధర్ రావు పంతాని సాయికుమార్ యరగల్ల వీరయ్య టిడిపి నాయకులు పాల్గొన్నారు

## ఆలపాటిని గెలిపించేందుకు కృషి చేయాలి..



పొన్నూరు (జనం రిపోర్టర్ ):ఉమ్మడి కృష్ణ - గుంటూరు జిల్లాల పట్టభద్ర ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థిగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ ను గెలిపించేందుకు సమిష్టిగా కృషి చేయాలని పొన్నూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు శుక్రవారం పొన్నూరు తెదేపా కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. 27న జరగబోయే ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించుకునే విధి విధానాలపై, ప్రతి ఒక్క ఓటర్ ను కలిసి కూటమి అభ్యర్థి గెలుపుకై చేయవలసిన భవిష్యత్ కార్యాచరణ పై చర్చించారు. ఈ సమావేశంలో పొన్నూరు పట్టణ క్లస్టర్ ఇంచార్జిలు, యూనిట్ ఇన్చార్జులు, బూత్ కన్వీనర్లు, మాజీ కౌన్సిలర్లు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## సింగరేణి కార్మికుల కు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలి.....

### ఐ.కృష్ణ ఐఎఫ్టీయు రాష్ట్ర అధ్యక్షులు....




రామగుండం(జనం రిపోర్టర్ ):రామగుండం:ఫిబ్రవరి 14. కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ, ఈనెల 20న సిపిఐ ఎం ఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో చలో హైదరాబాద్, ఇంద్ర పార్క్ వద్ద మహా ధర్నా ను విజయవంతం చేయాలని కోరుతూ, ప్రచారంలో భాగంగా శుక్రవారం సింగరేణి ఆర్ జి -డివిజన్ 2ఏ గని వద్ద సిపిఐ ఎం ఎల్ న్యూడెమోక్రసీ, ఐఎఫ్టీయు ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.ఈ ప్రచార కార్యక్రమంలో ఐఎఫ్టీయు రాష్ట్ర అధ్యక్షులు ఐ.కృష్ణ మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు సింగరేణి కార్మికులకు ఇచ్చిన వాగ్దానాలు, 6 గ్యారంటీల అమలు చేయాలని డిమాండ్ చేశారు.సింగరేణి కార్మికులకు సొంత ఇంటి పథకం అలాగే 20 లక్షల వడ్డీ లేని రుణం, సింగరేణి పరిరక్షణ, కొత్త భూగర్భ గనులు ,కోల్ బ్లాకులు సింగరేణికి ఇవ్వాలని, వన్ టైం సెటిల్మెంట్ క్రింద మానవత దృక్పథంతో డిపెండెంట్ కార్మికుల మారు పేర్లను సవరించి వెంటనే వారికి ఉద్యోగాలు ఇవ్వాలని, డిస్మిస్ కార్మికులకు తిరిగి ఉద్యోగంలోకి తీసుకోవాలని, సర్ఫేస్ లో ఖాళీలను పూర్తి చేయాలని, సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు హై పవర్ కమిటీ వేతనాలు ఇవ్వాలని, ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ, ఈనెల 20న. జరిగే చలో హైదరాబాద్ ఇంద్ర పార్క్ వద్ద జరిగే మహా ధర్నా లో అధిక సంఖ్యలో కార్మికుల పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎం ఎల్ న్యూడెమోక్రసీ, ఐఎఫ్టియు నాయకులు ఈ.నరేష్, జి.మల్లేశం, ఈ.రామకృష్ణ, శ్రీకాంత్, ప్రసాద్, ఎం.దుర్గయ్య, ఎం. కొమరయ్య, రవికుమార్,తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ ఆదిలక్ష్మి అమ్మవారి అన్న సమారాధన



మొగల్తూరు ఫిబ్రవరి 14 జనం రిపోర్టర్: మొగల్తూరు పోలీస్ స్టేషన్ వెనుక ఆదిలక్ష్మి అమ్మవారి కాలనీలో వేంచేసియున్న శ్రీ ఆదిలక్ష్మి అమ్మవారి జాతర ముగింపు సందర్భంగా శుక్రవారం భారీ అన్నదాన కార్యక్రమం ను ఆలయ కమిటీ నిర్వాహకులు చల్లా రామారావు (దొరయ్య,) ముత్యాలరావు, నరసింహమూర్తి, శ్రీనివాస్ లు నిర్వహించారు. భక్తులు వేలాది సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి అన్న సమారాధనను స్వీకరించారు.

## విద్యార్థులకు కంటి అద్దాలు ఉచితంగా పంపిణీ చేసిన రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి



శింగనమల / గార్లదిన్నె ఫిబ్రవరి 14 ( జనం న్యూస్ ) శింగనమల నియోజకవర్గం లోని గార్లదిన్నె మండల కేంద్రంలో గల మోడల్ స్కూల్ లో విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలు పంపిణి చేసిన ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య శాఖ మంత్రి వర్యులు సత్యకుమార్ యాదవ్. అంతకుముందుగా ముఖ్యఅతిథిగా విచ్చేసినటువంటి రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రికి శింగనమల శాసనసభ్యురాలు బండారు శ్రావణి శ్రీ, జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్, మోడల్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆరోగ్య శాఖ మంత్రివర్యులు సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులు చదువులోనూ, ఆటల్లోనూ రాణించాలంటే కంటి చూపు ముఖ్యమైనదని, కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోడీ రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వారి ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఉన్న ప్రతి పాఠశాలలో ఉన్న విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి, దృష్టిలోపం ఉన్నవారికి కంటి అద్దాలను ఉచితంగా పంపిణీ చేయాలని, అవసరమైతే కంటి చికిత్సలు నిర్వహించి పిల్లల కంటి చూపులు మెరుగు పరచాలన్నదే దీని ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ముఖ్యంగా సింగనమల నియోజకవర్గం శాసన సభ్యురాలు అయిన బండారు శ్రావణి శ్రీ నియోజకవర్గ సమస్యల పైన నిరంతరం పాటుపడుతుందని, నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన పనులను, పేదలకు సంబంధించిన ఇంటి స్థలాల పైన అసెంబ్లీలో గట్టిగా తమ వాయిస్ ని గట్టిగా వినిపిస్తోందని, నిజంగా ఇలాంటి డైనమిక్ లీడర్ మీ నియోజకవర్గంలో ఉండటం మీ నియోజకవర్గ ప్రజల అదృష్టమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్, జిల్లా వైద్యశాఖాదికారి, మోడల్ స్కూల్ ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, ఎంపీటీసీ, జడ్పిటిసి సభ్యులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, పలురంగాల ప్రభుత్వ అధికారులు, విద్యార్థినులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయాలి....

### ఈనెల 20న జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి....

### సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు. చిలక శంకర్....




రామగుండం(జనం రిపోర్టర్ ):రామగుండం:ఫిబ్రవరి 14. తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల నాడు ప్రకటించిన 6 గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 20న. నిర్వహించే చలో హైదరాబాద్ పోస్టర్ లను శుక్రవారం, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఎన్టీపీసీ కార్యాలయంలో చలో హైదరాబాద్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు చిలుక శంకర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటై 14 నెలలు పూర్తయినా ఇప్పటివరకు, ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఇండ్లు లేని పేదలందరికీ ఇండ్లు మంజూరు చేయాలన్నారు. రేషన్ కార్డు లేని పేద ప్రజలందరికీ వెంటనే రేషన్ కార్డులు మంజూరు చేయాలన్నారు. రైతు రుణమాఫీ రెండు లక్షల వరకు చేస్తామని, మాఫీ చేయడంలో విఫలమయ్యారన్నారు. రైతు భరోసా పథకాన్ని 15 వేల నుండి 12 వేలకు కుదించి అవి కూడా ఇవ్వడంలో విఫలమవుతున్నారన్నారు. కల్యాణ లక్ష్మి పథకానికి తులం బంగారం తుంగలో తొక్కారన్నారు. పెన్షన్లు పెంచడంలో కనీసం ఆలోచనలో కూడా లేదన్నారు. ఇవేకాక అనేక ఇతర హామీలను ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచి వాటి ఊసెత్తడం లేదన్నారు. రోజుకో పార్టీలు మారే దొంగలను పార్టీలో చేర్చుకోవడం మీద ఉన్న శ్రద్ధ, ఇచ్చిన హామీలు అమలు చేయడంలో లేదన్నారు. డబల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీలో అనేక అవకతవకలకు పాల్పడుతూ, ఏండ్ల తరబడి ఉన్న వారికి ఇవ్వకుండా, వలస వచ్చిన వారికి ఇండ్లు పంపిణీ చేస్తున్నారన్నారు. కొన్నిచోట్ల డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీలో కొందరు చోటా నాయకులు కమీషన్లు పుచ్చుకునే స్థితికి దిగజారారన్నారు. కమీషన్లు పుచ్చుకునే దొంగ నాయకులకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. ఒకపక్క రైతాంగం పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక, పెట్టుబడులు పెరిగిపోయి అప్పుల పాలవుతూ ఆత్మహత్యలకు పాల్పడుతుంటే, కనీసం ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ప్రజా సంపదను లూటీ చేయడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలన కొనసాగుతుందన్నారు. వెంటనే ఇచ్చిన హామీల అమలుకై ప్రజా పోరాటాలను ఉధృతం చేస్తామన్నారు. ఈనెల 20వ తేదీన ఇండ్లు కావలసిన పేదలందరూ, రేషన్ కార్డులు కావలసిన పేదలందరూ, రైతు రుణమాఫీ కావలసిన రైతులందరూ, రైతు భరోసా పథకం కావలసిన రైతులందరూ, పెన్షన్లు రావలసిన పెన్షన్ దారులందరూ, కల్యాణ లక్ష్మి పథకానికి తులం బంగారం రానటువంటి మహిళలందరూ చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎం ఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు బి బుచ్చన్న జి. కుమార్, పి. స్వామి, ఆర్. రాయమల్లు, పి. వెంకటస్వామి, జి. రాజయ్య, శ్రీనివాస్, మధు, లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం.




పొన్నూరు (జనం రిపోర్టర్ ):గుంటూరు జిల్లా పొన్నూరు పట్టణం, రూరల్ ప్రాంతాలలో నేడు శనివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందని పొన్నూరు విద్యుత్ సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి శ్యాం కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారాంతపు విద్యుత్ మరమ్మత్తులలో భాగంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. పట్టణ మండల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

## అధికారులకు ఎమ్మెల్సీ ఎన్నికలపై శిక్షణ తరగతులు

రేపల్లె (జనం రిపోర్టర్ ):ఎమ్మెల్సీ ఎన్నికల శిక్షణా తరగతులు మున్సిపల్ ఆఫీస్ రేపల్లెలో ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించినట్లు రెవెన్యూ డివిజనల్ అధికారి ఎన్ .రామలక్ష్మి తెలిపారు.స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో శుక్రవారం ఎన్నికల విధులు నిర్వహించే పోలింగ్ అధికారులకు, సహాయక పోలింగ్ అధికారులకు రూట్ అధికారులకు మరియు సెక్టార్ ఆఫీసర్లు శిక్షణ తరగతులు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 27న జరిగే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు బ్యాలెట్ బాక్సుల సేకరణ వాటిని ఉపయోగించే విధానం, పిఓల హ్యాండ్ బుక్ లోని అంశాలు, ఏపీవో హ్యాండ్ బుక్ లోని అంశాలను క్షుణ్ణంగా చదివి వివరించారు.ఎటువంటి తప్పులు దొర్లకుండా ప్రతి ఒక్క అధికారి తమకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించేలాగున ప్రతి అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. బ్యాలెట్ బాక్స్ లను ఎలా ఉపయోగించాలి, బాక్సులకు సీలు ఎలా వేయాలి తదితర అంశాలనువివరించారు.గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలలో విధులు నిర్వహించే అధికారులకు మరోసారి శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు.ప్రతి ఒక్క అధికారి శిక్షణకు హాజరై ఎన్నికలను అధికారుల సూచనలతో సమర్థవంతంగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల విధులను నిర్వహించాలని కోరారు. రేపల్లె డివిజన్ నందు 23 పోలింగ్ స్టేషన్లో ఉన్నవని వాటికి సంబంధించి ఎలక్షన్ విధులు అందరూ నిబద్ధతో పని చేయాలని కోరినారు కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ నాగిరెడ్డి , ఎమ్మెల్సీ శిక్షణ ఇచ్చు అధికారి మరియు డివిజన్ పరిధిలోని అందరు ఏ ఈ ఆర్ వోస్ పాల్గొనడం జరిగినది.

## ఆలయాల పూనర్నిర్మాణానికి విరాళం అందజేత



రామడుగు,(జనం రిపోర్టర్ ):రామడుగు మండలంలోని గోపాల్ రావు పేట గ్రామంలో దేవాలయాల పునర్నిర్మాణంలో భాగంగా శుక్రవారం గ్రామానికి చెందిన బేడ బుడగ జంగం (ఎస్సీ) లోని కీర్తిశేషులు కళ్లెం పుల్లయ్య,మిరియాల నమ్మయ్యల జ్ఞాపకార్థం 10వేల 16 రూపాయలను దేవాలయాల పునర్నిర్మాణ కమిటీకి అందజేశారు. ఈ సందర్భంగా పునర్నిర్మాణ కమిటీ సభ్యులు కులస్తులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## త్రాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు



:శింగనమల మండలం(జనం రిపోర్టర్ ): సి బండమీదపల్లి లో తాగునీటి కోసం రోడ్ ఎక్కిన మహిళలు గత కొన్ని రోజులుగా బీసీ కాలనీలో నీటి సమస్య ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టుకున్న నీటి సమస్య తీరకపోవడంతో మహిళలు బిందెలతో అనంతపురం తాడిపత్రి ప్రధాన రహదారి పైన నీటి బిందెలతో రోడ్డుపైన బైఠాయించారు అధికారులు స్పందించి నీటి సరఫరా గ్రామస్తులు కోరుకుంటున్నారు..

## ఓటమి భయంతో ప్రతిపక్షాలు విష ప్రచారం పభుత్వానికి పట్టభద్రులకు వారధినవుతా కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి




జగిత్యాల,(జనం రిపోర్టర్ ):రానున్న కరీంనగర్ అదిలాబాద్ నిజామాబాద్ మెదక్ పట్టభద్రుల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ ఓటమిని ముందే అంగీకరించాయని భయంతోనే తనపై ప్రతిపక్షాలు సోషల్ మీడియా ద్వారా వ్యక్తిగతంగా విష ప్రచారం చేస్తున్నాయని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి ఘాటుగా స్పందించారు.శుక్రవారం జగిత్యాల జిల్లాలో విస్తృతంగా పర్యటించారు.. ధర్మపురి,జగిత్యాల,కోరుట్ల,నియోజకవర్గాల్లో పట్టభద్రులు కాంగ్రెస్ శ్రేణులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 27న జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు స్థానిక సంస్థల ఎన్నికలకు రిహార్సర్ లాంటివని కాంగ్రెస్ శ్రేణులంతా కష్టపడి పని చేయాలని పిలుపునిచ్చారు... కాంగ్రెస్ ప్రభుత్వం తోనే ఉద్యోగ నిరుద్యోగ పట్టభద్రుల సమస్యలు పరిష్కారం అవుతాయని



ప్రభుత్వానికి పట్టభద్రులకు వారధిగా ఉండి వారి సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని వెల్లడించారు... కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో పెట్టిన జాబ్ క్యాలెండర్ అమలుకు కృషి చేస్తానని... అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే 55 వేల ఉద్యోగాలు ప్రకటించి నిరుద్యోగ యువతకు భరోసా కల్పించిందని అన్నారు.. ఎన్ ఎస్ యు ఐ యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు ప్రతిపక్షాలు సోషల్ మీడియా ద్వారా చేసే విష ప్రచారాలను తిప్పికొట్టాలని.. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలను గడపగడపకు వెళ్లి ప్రతి పట్టభద్రుని కలిసి వివరించాలని తెలిపారు.. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ధర్మపురి శాసనసభ్యులు అడ్లూరు లక్ష్మణ్ కుమార్.. ఎమ్మెల్సీ టి జీవన్ రెడ్డి, కోరుట్ల నియోజకవర్గ ఇన్చార్జి జువ్వాడి నరసింగ రావు పలువురు మండల అధ్యక్షులు మార్కెట్ కమిటీ చైర్మన్ లు నాయకులు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## నగరంలోని వివిధ డివిజన్ లలో పర్యటించిన జిల్లా అదనపు కలెక్టర్....



రామగుండం:(జనం రిపోర్టర్ ):పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్, స్థానిక సంస్థలు , రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె, అరుణ శ్రీ శుక్రవారం నగరంలోని వివిధ డివిజన్ లలో పర్యటించి పారిశుద్ధ్య నిర్వహణ తీరు, వివిధ సమస్యలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ముందుగా పి కె రామయ్య కాలనీ లోని ఎం పి పి ఎస్ పాటశాల సందర్శించారు. పాటశాల విద్యార్థుల సౌకర్యార్థం ఎన్ టి పి సి సంస్థ ఆధ్వర్యంలో డైనింగ్ హాల్ నిర్మించినప్పటికీ ఇంకా ప్రారంభించ లేదని ఉపాధ్యాయులు , విద్యార్థులు దృష్టికి తీసురావడంతో సంబందిత ఎన్ టి పి సి అధికారులతో ఫోన్ లో సంప్రదించి వెంటనే ఉపయోగంలోకి తీసుకురావడానికి చర్యలు తీసుకోవాలని



ఆదేశించారు. అలాగే లోతట్టు ప్రాంతాన్ని, ఫ్లైయాష్ తో నింపి చదును చేయించాలని ఎన్ టి పి సి అధికారులను ఆదేశించారు. అనంతరం మార్కండేయ కాలనీ లో నాలా ఆక్రమణకు గురయిన ప్రాంతాన్ని పరిశీలించారు. యుద్ద ప్రాతిపదికన సదరు నాలా ఆక్రమణ లను తొలగించాలని పట్టణ ప్రణాళికా విభాగం అధికారులను ఆదేశించారు.



వీధి వ్యాపారుల సౌకర్యార్థం వెండింగ్ జోన్స్ ఏర్పాటు చేసి కియోస్క్ లు నిర్మించడానికి సప్తగిరి కాలనీ , గోదావరి ఖని బస్ స్టాండ్ ప్రాంతాల్లో సానుకూల ప్రదేశాలను పరిశీలించారు. ఈ సంధర్భంగా అదనపు కలెక్టర్ వెంట నగర పాలక సంస్థకు చెందిన వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## అశ్వారావుపేట కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడి ఎన్నిక ఏకగ్రీవం

### నూతన అధ్యక్షుడి గా ఆరేపల్లి వెంకటేష్ గౌడ్ (గోవింద్)




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,(జనం రిపోర్టర్ ): అశ్వారావుపేట మండల కేంద్రంలో కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్ష ఎన్నికలో సభ్యులందరూ కలిసి తమ అధ్యక్షుడిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎలక్షన్ ఆఫీసర్ కె. రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎన్నిక లో అధ్యక్షుడి గా ఆరేపల్లి వెంకటేష్ గౌడ్ (గోవింద్), కార్యదర్శిగా మోర్ల దుర్గారావు గౌడ్, ఉపాధ్యక్షుడు గా, ఆరేపల్లి రామగౌడ్ ని ఎన్నుకున్నారు. ఈ ఎన్నిక కార్యక్రమంలో అశ్వారావుపేట పట్టణ గౌడ పెద్దలు ఆరేపల్లి సాంబశివరావు, నాయుడు శ్రీను, ఆరేపల్లి సత్యనారాయణ, ఆరేపల్లి కొండయ్య, బుర్ర నాగరాజు, పి.మురళి, బి. అంజయ్య, బి. వెంకన్న బాబు, కల్లుగీత వృత్తిదారులు మరియు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అశ్వారావుపేట కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం నూతన అధ్యక్షుడుగా ఎన్నుకున్న ఆరేపల్లి గోవింద్ మాట్లాడుతూ తనకు ఇచ్చిన అవకాశాన్ని పెద్దల సహకారంతో, తోటి సభ్యుల సహకారంతో కలిసి పని చేస్తానని, తమ సంఘం పరిధిలో ఉన్న కల్లు గీత వృత్తి దారులకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు అమలకు తన వంతు కృషి చేస్తానని తెలియజేశారు, ఈ సందర్భంగా అశ్వారావుపేట పట్టణ గౌడ పెద్దలు మాట్లాడుతూ కల్లుగీత వృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యలు ఏమైనా ఉంటే తమ నూతన అధ్యక్షుడికి తెలియజేయాలని కోరారు, పట్టణంలో తాటి చెట్లు కనుమరుగవు తున్న నేపథ్యంలో కల్లుగీత వృత్తిదారులకు ప్రభుత్వం తాటి చెట్లు పెంచుకోవడానికి స్థలం కేటాయించాలని, అలాగే 50 సంవత్సరాలు దాటిన కల్లుగీత వృత్తిదారులకు పెన్షన్ అమలు చేయాలని, చెట్టు మీద నుండి కింద పడ్డ కల్లుగీత వృత్తిదారులకు హాస్పటల్ కి అయ్యే ఖర్చు, సహజ మరణం కి కూడా బీమా కల్పించాలి అని ఈ సందర్భంగా తెలియజేశారు.

## ఘనంగా ఆలూరు సాంబ శివారెడ్డి పుట్టినరోజు వేడుకలు








సింగనమల(జనం రిపోర్టర్ ):అనంతపురంలోని ఆలూరు సాంబశివారెడ్డి స్వగృహం నందు వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు అభిమానుల మధ్య ఆయన జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.అనంతరం కేక్ కట్ చేశారు. పుట్టినరోజు సందర్భంగా అనంతపురంలో ప్రభుత్వ ఆసుపత్రి నందు మరియు పలు చోట్ల అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు అనంతపురం వైస్సార్సీపీ నేత ఆలూరు సాంబశివరెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. సుఖ, సంతోషాలతో ఆరోగ్యంగా ఉండాలని, రాజకీయంగా మరింత స్థాయికి ఎదగాలని దేవుణ్ణి ప్రార్థించారు.

## నీటి సరఫరా లేని ప్రాంతాలపై దృష్టి సారించాలి....

నగర పాలక సంస్థ ప్రత్యేకాధికారి కోయ శ్రీ హర్ష , అదనపు కలెక్టర్ జె.అరుణ శ్రీ....



రామగుండం:(జనం రిపోర్టర్ ):రామగుండం:ఫిబ్రవరి 14. నీటి ఎద్దడి సమస్య ఎదుర్కోవడానికి జిల్లా కలెక్టర్ , రామగుండం నగర పాలక సంస్థ ప్రత్యేకాధికారి కోయ శ్రీ హర్ష , అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు కమిషనర్ జె. అరుణ శ్రీ ఆదేశాలతో



రామగుండం నగర పాలక సంస్థ అధికారులు వేసవి కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొని అమలు చేస్తున్నారు. ప్రధానంగా పైప్ లైన్ ద్వారా నీటి సరఫరా లేని ప్రాంతాలపై దృష్టి సారించారు. ఈ మేరకు పదిహేనవ ఆర్థిక సంఘం అన్ టైడ్ గ్రాంట్స్ ఒక కోటి రూపాయలు కేటాయించగా రూ 50.00 లక్షల అంచనా వ్యయం తో పైప్ లైన్ల నిర్మాణం , రూ 30.00 లక్షల అంచనా వ్యయంతో లీకేజీల అరెస్ట్ , రూ 20.00 లక్షల అంచనా వ్యయంతో బోర్ వెల్ మెటీరియల్ కొనుగోలు చేసి పాడై పోయిన బోర్లను ఉపయోగంలోకి తీసుకురావడం వంటి పనులను చేపడుతున్నారు. రామగుండం పట్టణం , పి కె రామయ్య కాలనీ , సప్తగిరి కాలనీ తదితర ప్రాంతాల్లో పనులు చేపడుతున్నట్లు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.

## జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు రహదారి భద్రత పై అవగాహన

### వ్యక్తిగత సమస్యలతో వత్తిడులకు లోనవుతూ డ్రైవింగ్ చేయకూడదు

### మద్యం సేవించి వాహనాలు నడపరాదు

### డ్రైవర్లు తరచు వైద్య పరీక్షలు చేయించు కోవాలి




బాపట్ల జిల్లా (జనం రిపోర్టర్ ):బాపట్ల జిల్లా లో 36 వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా ఈ రోజు స్థానిక ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ నందు స్కూల్ బస్ డ్రైవర్ లకు ఉచిత వైద్య పరీక్షలు మరియు రహదారి భద్రత పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న అడిషనల్ ఎస్. పి టి.పి.విఠలేశవ్వర్ మాట్లాడుతూ డ్రైవర్లు డ్రైవింగ్ చేసే సమయంలో మనసు ప్రశాంతంగా ఉంచుకోవాలని పర్సనల్ సమస్యలతో వత్తిడులకు లోనవుతూ డ్రైవింగ్ చేస్తే ప్రమాదం జరగడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. డ్రైవర్లు డ్రైవ్ చేసి ఇంటికి తిరిగొచ్చేవరకు ఇంటి దగ్గర భార్య, పిల్లలు ఎదురు చూస్తూ ఉంటారన్న విషయాన్ని డ్రైవర్లు గుర్తుపెట్టుకోవాలన్నారు. బస్ లలోనూ ఆటో లలోనూ పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లడం నేరమని తెలిపారు. బస్ లను నడపడానికి కావలసిన అన్ని డాక్యుమెంట్లను ఫోర్స్ లో ఉండేలా చూసుకోవాలన్నారు. టు వీలర్ నడిపే ప్రతి ఒక్కరు హెల్మెట్ తప్పని సరిగా ధరించాలని కోరారు. ప్రమాదాలలో గాయపడిన వారికి సాయం చెయ్యడానికి పౌరులు అందరు ముందుకు రావాలని, వారికి పోలీసు ల నుండి గాని, మెడికల్ సిబ్బంది నుండి గాని ఏ విధమైన ఇబ్బందులు ఉండవని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం లో భాగం గా డ్రైవర్లకు నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. డిస్ట్రిక్ట్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ ఎస్. విజయమ్మ మాట్లాడుతూ డ్రైవర్లు తరచు వైద్య పరీక్షలు చేయించు కోవాలని మరీ ముఖ్యంగా కంటి చూపునకు సంబంధించిన పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని కోరారు. పి.ఎం.జె. వై జీవిత భీమా పథకం లో జాయిన్ కావాలని డ్రైవర్లను ఆమె కోరారు. డిస్ట్రిక్ట్ ట్రాన్స్పోర్ట్ ఆఫీసర్, టి.కె.పరంధామ రెడ్డి మాట్లాడుతూ స్కూల్ బస్ లను ఎప్పటికప్పుడు కండిషన్లో ఉండేలా చూసుకోవాలని, హైవే జంక్షన్ లలోను, కాలువ పక్క రోడ్ లలోనూ డ్రైవ్ చేసేప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని డ్రైవర్లకు సూచించారు. బస్ లో ప్రయాణించే విద్యార్థులు తమ కుటుంబ సభ్యులుగా భావించి వారిని సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాల్సిన బాధ్యత డ్రైవర్ల పై ఉందని ఆయన అన్నారు. ఇంకా ఈ సమావేశంలో ఆర్.టి.సి, డి.ఎం. బి.శ్రీమన్నారాయణ, ఆప్థమాలజిస్ట్ శ్రీనివాసరావు, సైకాలజిస్ట్ శ్రీమన్నారాయణ, కళాశాల ప్రిన్సిపల్ ఆంజనేయులు, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్స్ రంగారావు, ప్రసన్నకుమారి, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్స్ పి.అంకమ రావు,కిషోర్ బాబు మరియు అధిక సంఖ్యలో డ్రైవర్లు పాల్గొన్నారు

## ఇంటిని,సామాన్లు మారుస్తున్న ఇంటి యజమాని..! పోయిన ఇంటి లింక్ డాక్యుమెంట్స్..!



| | | | | | |
|---|---|---|---|---|---|
| | VASU [S] MUNICIPAL ROAD [E]: OPEN PLOT OF KRISHNA [W]: HOUSE OF SATHAIAH Link Doct: 6375/2018 Book-1 of SRO 1506 | (P) 27-12-2023 | RECONVEYANCE DEED OR Mkt.Value:Rs. 552500 Cons.Value:Rs. 300000 | 2.(RE)MURALI KRISHNA | 3918/2023 [1] of SRO TANDUR(1506) |
| 3/6 | VILL/COL: TANDUR (M)/RESIDENTIAL LOCALITY W-B: 1-3 HOUSE: 1-3-76 EXTENT: 65SQ.Yds BUILT: 585SQ. FT Boundaries: [N]: HOUSE AND OPEN PLOT OF VASU [S] MUNICIPAL ROAD [E]: OPEN PLOT OF KRISHNA [W]: HOUSE OF SATHAIAH Link Doct: 3283/2010 Book-1 of SRO 1506 | (R) 22-09-2018 (E) 20-09-2018 (P) 22-09-2018 | 0208 Deposit of Title Deeds Mkt.Value:Rs. 319800 Cons.Value:Rs. 300000 | 1.(MR)MURALI KRISHNA 2.(ME)M/S FIVE STAR BUSINESS FINANCE LIMITED | 0/0 6375/2018 [1] of SRO TANDUR(1506) |
| 4/6 | VILL/COL: TANDUR (M)/RESIDENTIAL LOCALITY W-B: 1-3 HOUSE: 1-3-76 EXTENT: 65SQ.Yds BUILT: 585SQ. FT Boundaries: [N]: HOUSE & OPEN PLOT OF VASU [S] MUNCIPAL ROAD [E]: OPEN PLOT OF KRISHNA [W]: HOUSE OF SATHAIAH Link Doct: 262/2003 Book-1 of SRO 1506 Link Doct: 392/2000 Book-1 of SRO 1506 | (R) 28-10-2010 (E) 27-10-2010 (P) 28-10-2010 | 0101 Sale Deed Mkt.Value:Rs. 240500 Cons.Value:Rs. 241000 | 1.(EX)N.GEETA 2.(CL)MURALI KRISHNA | 0/0 CD_Volume: 162 3283/2010 [@] of SRO TANDUR(1506) |
| 5/6 | VILL/COL: TANDUR (M)/Indira Nagar Budigejangam W-B: 1-3 HOUSE: 1-3-76 EXTENT: 65SQ.Yds BUILT: 585SQ. FT Boundaries: [N]: HOUSE & OPEN PLOT OF VASU [S] MUNICIPAL ROAD [E]: OPEN PLOT OF KRISHNA [W]: HOUSE OF SATHAIAH Link Doct: 392/2000 Book-1 of SRO 1506 | (R) 05-02-2003 (E) 05-02-2003 (P) 05-02-2003 | 0101 Sale Deed Mkt.Value:Rs. 138100 Cons.Value:Rs. 140000 | 1.(EX)KOTHAHPALLY BASWALINGAM 2.(CL)N.GEETHA | 0/0 CD_Volume: 105 262/2003 [@] of SRO TANDUR(1506) |
| 6/6 | VILL/COL: TANDUR W-B: 1-3 HOUSE: 7-3-76, EXTENT: , 65.000 Y, Boundaries: [N]: HOUSE OF VASU [S] ROAD [E]: OPEN PLACE OF VENDOR [W]: HOUSE OF SATTAIAH | (R) 25-01-2000 (E) 25-01-2000 (P) 25-01-2000 | 5A SALE Mkt.Value:Rs. 117000 Cons.Value:Rs. 117000 | 1.(E)KRISHNA 2.(C)K.BASWA LINGAM | 498/469 392/2000 [@] of SRO TANDUR(1506) |

Note
This Report is for Information only.

వికారాబాద్ జిల్లా ప్రతినిధి:నవాబ్ పేట్(జనం రిపోర్టర్ )ఇంటిని,వస్తువులు మారుస్తున్న సమయంలో తమ ఇంటికి సంబందించిన లింక్ పత్రాలు ఎక్కడో పోయాయని సొల్లెటి నర్సింహా చారి అన్నారు.ఆయన ఓ ప్రకటనలో సోల్లెటి నర్సింహా చారి (50)తండ్రి చంద్రయ్య చారి వృత్తి కంసాలి(అవుసుల) వికారాబాద్ జిల్లా,తాండూర్ ఇంద్రానగర్ జీవిస్తున్నాను.తమ ఇంటికి సంబంధించిన లింక్ పత్రాలు 392/2000 ఆఫ్ ఎస్ఆర్ఓ 1506 నెంబర్ ఉన్నాయి.తమ ఇంటిని వస్తువులను మారుస్తున్న గత నెల 2వ తేదీ 2025నా సమయంలో లింక్ డాక్యుమెంట్స్ ఎక్కడో పడిపోయాయి.ఎంత వెతికినా కనపడడం లేదని చెప్పారు.ఇట్టి దానిపై నేను పేపర్లో ఇవ్వడం జరుగుతుందన్నారు.

## కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించండి

### అన్ని వర్గాల ప్రజలకు అండగా కాంగ్రెస్ కర్ర సత్య ప్రసన్న



రామడుగు(జనం రిపోర్టర్ ): రానున్న కరీంనగర్,అదిలాబాద్,నిజామాబాద్,మెదక్ పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి వూట్కూరి నరేందర్ రెడ్డి కి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని రామడుగు మండలం లోని తిర్మలాపూర్ గ్రామంలో ప్రచారం చేస్తూ పట్టభద్రులను కరీంనగర్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న వెంకటరాం రెడ్డి కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు లక్ష్మణ్, మాజి మండల అధ్యక్షులు తడకొండ అంజలి హన్మంతు, మాజి సర్పంచ్ సత్యరాజవర్మ,మాజి సర్పంచ్ బక్కశెట్టి నర్సయ్య,కట్ల శంకర్, ఇండ్ల పోచమల్లు,గంగాధర శంకరయ్య ,తడగొండ విష్ణు తదితరులు పాల్గొన్నారు

## గజిటెడ్ లెక్చరర్ ను సన్మానించిన మాజీ కౌన్సిలర్



అమరచింత వనపర్తి ప్రతినిధి (జనం రిపోర్టర్ ):అమరచింత మునిసిపాలిటీ కేంద్రంలోని 5వ వార్డుకు చెందిన రాకేష్ గజిటెడ్ లెక్చరర్ ఉద్యోగాన్ని పొందారు. మాజీ కౌన్సిలర్ లెనిన్ రాజకుమార్, కాలనీ యువకులు ఆయనను ఘనంగా సన్మానించారు. బీడీ కార్మిక కుటుంబానికి చెందిన రాకేష్ మొక్కవోని ధైర్యంతో గతంలోనే ఎస్జీటీ ఉపాధ్యాయునిగా ఉద్యోగ సంపాదించి అందులో కొనసాగుతున్నారు. ఇటీవల టీజీపీఎస్సీ ద్వారా ఆయన గెజిటెడ్ లెక్చరర్ గా ఉద్యోగం సంపాదించారు. ఐదవ వార్డుకు చెందిన నిర్మలమ్మ జానప్ప లకు చెందిన కుమారుడు రాకేష్ బీడీ కార్మికుడిగా ఉంటూ ఉన్నత స్థాయికి చేరుకోవడంతో శుక్రవారం 5వ వార్డు మాజీ కౌన్సిలర్ లెనిన్ రాజకుమార్, మరికొంతమంది యువకులు రాకేష్ ను శాలువా పూల మాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ మాట్లాడుతూ దళిత కులంలో అందులో బీడీ కార్మిక కుటుంబంలో అష్ట కష్టాలు పడి ఉన్నత స్థాయికి చేరుకోవడం అభినందనీయమని అన్నారు. రాకేష్ విజయం కాలనీలోని ఎంతోమంది దళిత విద్యార్థులకు ఆదర్శమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీకి చెందిన యువకులు, స్నేహితులు పాల్గొన్నారు

## ఘనంగా మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ సంజీవయ్య జయంతి వేడుకలు




పెదకాకాని(జనం రిపోర్టర్ ):పెదకాకాని, -మండల కేంద్రమైన పెదకాకాని సెంటర్ నందు మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ దామోదరం సంజీవయ్య104 వ, జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తొలి దళిత ముఖ్యమంత్రిగా ఆయన ఖ్యాతికెక్కారన్నారు. తన పదవీకాలంలో అనేక విప్లవాత్మక పథకాలతో ప్రజల అభ్యున్నతికి కృషి చేశారని కొనియాడారు. తను నమ్మిన విలువలకు జీవితాంతం కట్టుబడిన వ్యక్తి దామోదరం సంజీవయ్య అని అన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బడుగు, బలహీన వర్గాల సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు కంతేటి యలమందరావు, ఏఐఎం జిల్లా అధ్యక్షులు బండ్లమూడి చక్రి, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు మధుబాబు, మొహిద్దిన్ భాష, పెద్ద రంగయ్య, దాసు, మనోజ్, హనోక్, కిషోర్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

## అంబాలపూర్ అంగన్వాడీలో శక్రవారం సభ



శంకరపట్నం (జనం రిపోర్టర్ ):శంకరపట్నం మండల పరిధిలోని అంబాలాపూర్ అంగన్వాడీ కేంద్రంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ అరుణ ఆధ్వర్యంలో శుక్రవారం సభ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శంకరపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర డాక్టర్ శ్రావణ్ కుమార్,డాక్టర్ సంధ్య హాజరై ఆరోగ్య మహిళ కార్యక్రమం పై,షుగర్ బోర్డు పై అవగాహన కల్పించారు .సూపర్వైజర్ అరుణ మాట్లాడుతూ మహిళలు, చిన్నారులకు పోషకాహారం పై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమానికి ఏఎన్ఎం ,అంగన్వాడి టీచర్,ఆశాలు,పాల్గొన్నారు.

## ఆరు గ్యారంటీలు తక్షణమే అమలు చేయాలి....

### చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి...

### -మేరుగు చంద్రయ్య అఖిలభారత రైతుకూలీ సంఘం రాష్ట్ర నాయకులు...



రామగుండం(జనం రిపోర్టర్ ): రామగుండం:ఫిబ్రవరి 14. అంతర్గాం మండలం పెద్దంపేట గ్రామంలోని సిపిఐ ఎం-ఎల్ న్యూడెమోక్రసీ కార్యాలయ ఆవరణలో పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపులో బాగంగా, జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 20న. హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద జరుగు బహిరంగసభకు వేలాదిగా ప్రజలు తరలిరావాలని, చలో హైదరాబాద్ పోస్టర్స్ ను ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా అఖిలభారత రైతు-కూలీ సంఘం ఎఐ కెఎం ఎస్ రాష్ట్ర నాయకులు మేరుగు చంద్రయ్య హాజరై మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి 14 నెలలు గడుస్తున్నా, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల నాడు ప్రకటించిన 6 గ్యారంటీల హామీని పూర్తిగా అమలు జరపడంలో విఫలమైందని దుయ్యబట్టారు. ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని, అలాగే అర్హులైన పేదలందరికీ ఇండ్లు, రేషన్ కార్డులు వెంటనే మంజూరు చేయాలనీ డిమాండ్ చేశారు. ఒకపక్క రైతాంగం పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక పెట్టుబడులు పెరిగిపోయి అప్పుల పాలవుతూ ఆత్మహత్యలకు పాల్పడుతుంటే, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కనీసం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తక్షణమే అమలు చేసే వరకు ప్రజా పోరాటాలను ఉధృతం చేయాలని, ఇందులో భాగంగానే ఈనెల 20న. హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద జరుగు సభకు ప్రజలు, ప్రజాస్వామిక వాదులు అదిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఐ ఎం-ఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు కొల్లూరి మల్లేష్, గుండేటి మల్లేష్, డివిజన్, మండల నాయకులు పైడిపల్లి రమేష్, ఈదునూరి బాబు, పోచయ్య, జంపయ్య, స్వామి, కుమార్, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా నాయకులు కోడిపుంజుల స్వప్న, పి అమృతమ్మ, ఎన్ రాజక్క తదితరులు పాల్గొన్నారు.

## మత్స్య గిరింద్ర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే



శంకరపట్నం (జనం రిపోర్టర్ ):శంకరపట్నం మండలం కొత్తగట్టు మత్స్య గిరింద్ర స్వామిని మానకొండూరు ఎమ్మెల్యే కవంపల్లి సత్యనారాయణ శుక్రవారం దర్శించుకున్నారు. కొత్తగట్టు గుట్టపై జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా మత్య గిరింద్ర స్వామి జాతర సందర్భంగా ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం ఎమ్మెల్యే కవంపల్లి సత్యనారాయణకు కొత్తగట్టు మత్స్య గిరింద్ర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ ఉప్పుగల్ల మల్లారెడ్డి శాలువాతో సన్మానించారు. మాజీ జెడ్పిటిసి సభ్యులు బత్తిని శ్రీనివాస్ గౌడ్, హుజురాబాద్ మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ నాంపల్లి తిరుపతి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గోపగోని బసవయ్య గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు కవ్వ పద్మను సత్కరించారు. గట్టు తిరుపతి, బండారి తిరుపతి, ఆలయ అర్చకులు వేద ఆశీర్వాదాలు అందించారు.

## పుల్వామా అమరవీరులకు ఘన నివాళులు



అమరచింత వనపర్తి ప్రతినిధి (జనం రిపోర్టర్ ): పుల్వామా దాడిలో అసువులు బాసిన అమరవీరులకు బిజెపి నగర శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని బిజెపి జండా కట్ట వద్ద బిజెపి, బిజెవైఎం నాయకులు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా బిజెపి, బిజెవైఎం నాయకులు మాట్లాడుతూ ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్న మన దేశ సైనికులు అంతమందిస్తారని అన్నారు. పుల్వామా దాడిలో అమరులైన సైనికులకు పూల తో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం రాజు, మరాఠీ అశోక్ కుమార్, నరాల నారాయణ, మంగ అంజి, విజయ్ యాదవ్, వాటర్ శ్రీనివాస్ యాదవ్, సిద్దు రాములు, వెంకటేష్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

## పుట్నూర్ యునాని ఆరోగ్య కేంద్రాన్ని పున ప్రారంభించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారికి వినతి పత్రం సమర్పించిన వేల్పుల రాజ్ కుమార్



రామగుండం(జనం రిపోర్టర్ ):రామగుండం:ఫిబ్రవరి 14. పాలకుర్తి మండల పు ట్నూరు గ్రామపరిధిలో ఉన్న పుట్నూర్ ఆరోగ్య కేంద్రం లో ఇదివరకు ఉన్నటువంటి యునాని కేంద్రం గత కొద్దిరోజుల క్రితం నుండి యునాని మందులు ఇవ్వడం లేదు, అట్టి కేంద్రాన్ని జిల్లా ఆరోగ్య కేంద్రానికి తరలించారు. కేంద్రాన్ని మరల పున ప్రారంభించి కొత్తపల్లి, ఈశాల తక్కల్లాపల్లి, రామారావు పల్లి, పుట్నూర్, గుడిపల్లి, జయ్యారం, కుక్కల గూడూరు , వెంనూర్ గ్రామాల ప్రజలకు వైద్య సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.ఈ కార్యక్రమంలో వేల్పుల రాజ్ కుమార్, తుదూరి రాంబాబు, దుర్గం కుమార్, మునిగాళ్ల ప్రసాద్, బండారి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## వీర జవాన్లకు ఘన నివాళులు



రామడుగు,(జనం రిపోర్టర్ ):2019 పుల్వామా ఉగ్రదాడిలో అసువులు బాసిన అమరవీరులకు కరీంనగర్ జిల్లా రామడుగు మండలం గోపాలరావు పేట గ్రామంలో నేచర్ యూత్ క్లబ్ వారి ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో యూత్ క్లబ్ అధ్యక్షులు కాసారపు పరశురామ్ గౌడ్,ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ గౌడ్,ఉపాధ్యక్షులు గడ్డం రత్నాకర్,సంయుక్త కార్యదర్శి గాజురవేణి మహేష్,నేరెళ్ల అజయ్,ఇనుగుర్తి రఘువీర్, జనగణమన కమిటీ అధ్యక్షులు మహిపాల్ రెడ్డి,కొండ శ్రీనివాస్,అక్షర స్కూల్ యజమాన్యం,గ్రామ ప్రజలుపాల్గొన్నారు.

## గుంటిపల్లి గ్రామ ప్రజలకు సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన కల్పించిన ఎస్సై నరేందర్



ఆత్మకూర్ వనపర్తి ప్రతినిధి(జనం రిపోర్టర్ ):ఆత్మకూరు మండలం గుంటి పల్లి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు ఆవశ్యకతపై శుక్రవారం ఎస్సై నరేందర్ గ్రామ ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామస్తులు తమ గ్రామంలో 10 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడానికి ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా సీసీ కెమెరాలు ప్రజల రక్షణకు, వ్యక్తిగత ప్రభుత్వ ఆస్తుల రక్షణకు తోడ్పడతాయని ఏలాంటి దొంగతనాలు, అవాంఛనీయ సంఘటనలు జరిగినట్లయితే సీసీ కెమెరాలు కీలకపాత్ర పోషిస్తాయని అన్నారు. దోషులను గుర్తించి వారిపై కేసులు నమోదు చేయుటకు వీలుగా ఉంటుందని ఎస్సై అన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేందుకు గ్రామంలో అందరూ భాగస్వామ్యమై రూ,20 వేల రూపాయలను ఎస్సై నరేందర్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో గుంటిపల్లి గ్రామ పెద్దలు యువకులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కోర్టు విధులను బహిష్కరించిన మెట్‌పల్లి న్యాయవాదులు




మెట్‌పల్లి, ఫిబ్రవరి 14 జనం రిపోర్టర్ : రంగారెడ్డి జిల్లా కోర్టులో ఓ హత్యాయత్నం కేసులో నేరస్తుడు రంగారెడ్డి జిల్లా మహిళా న్యాయమూర్తి పై చెప్పు విసిరిన ఘటనపై ఈరోజు కోర్టు విధులను బహిష్కరించినట్లు మెట్‌పల్లి న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి తెలిపారు కరణ్ సింగ్ అనే నిందితుడు ఓ వ్యక్తిపై తల్వార్ తో దాడి చేసి హత్య చేసేందుకు యత్నించిన ఘటనకు రెండు రోజుల క్రితం రంగారెడ్డి జిల్లా 9వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి హరీష యావజీవ కారాగారశిక్ష విధించడం జరిగింది. మరో హత్య కేసులో జైల్లో ఉన్నటువంటి కరణ్ సింగ్ నిందితున్ని పోలీస్ లు కోర్టులో హాజరుపరచగా అకస్మాత్తుగా జడ్జి వైపు చెప్పు విసురగా ఆ చెప్పు జడ్జికి తగలకుండా పక్కనే పడిపోయింది. వెంటనే నిందితుడు కోపంతో నాకే యావజీవ కారాగార శిక్ష వేస్తారా అంటూ దుర్భాషలాడం మొదలుపెట్టాడు. దాంతో మరో కేసులో మూడవ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఎదుట నిందితున్ని హాజరు పరచగా అతను అక్కడ న్యాయవాదులను కూడా దూషించడం జరిగిందని, కరణ్ సింగ్ పై వెంటనే చట్టరీత్య కఠిన చర్యలు తీసుకోవాలని మెట్‌పల్లి న్యాయవాదుల సంఘం డిమాండ్ చేసింది ఈ ఘటనను నిరసిస్తూ ఈరోజు రాష్ట్రవ్యాప్తంగా కోర్టు విధులను బహిష్కరించినట్లు తెలంగాణ ఫెడరేషన్ న్యాయవాదుల సంఘం అధికార ప్రతినిధి పుప్పాల లింబాద్రి తెలిపారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు రాంబాబు కార్యదర్శి వేణుగోపాల్ న్యాయవాదులు కే శ్రీనివాస్, వెంకటస్వామి, రాజ్, మహమ్మద్, ఉజ్జల శ్రీనివాస్, యుద్ధ వీర్, అలాల సత్యనారాయణ, భానుమూర్తి, మధుసూదన్ రెడ్డి, శేఖర్, జగన్, సుధాకర్, గంగాధర్, రాజారెడ్డి, శ్రీనివాస్, వెంకటేష్, రామ్ రెడ్డి, ప్రవీణ్, సుదర్శన్, నర్సా గౌడ్, అశోక్, మహిళా న్యాయవాదులు స్రవంతి, మానస, కావేరి, శ్రీలేఖ తదితరులు పాల్గొన్నారు.

## పీసా చట్టంపై అందరూ అవగాహన పెంచుకోవాలి ఏపియస్ఐఆర్డి పరిశీలనాధికారి శ్రీ రమేష్



రాజవొమ్మంగి,ఫిబ్రవరి 14 జనం రిపోర్టర్:అల్లూరి సీతారామరాజు జిల్లా రాజవొమ్మంగి ఎంపిడిఓ కార్యాలయంలో పీసా చట్టం తరగతుల్లో భాగంగా శుక్రవారం పంచాయతీ రాజ్ కమిషనర్ శ్రీ కృష్ణ తేజ ఏపియస్ఐఆర్డి డైరెక్టర్ మొహమ్మద్ దివాన్ మైదీన్ వారు ఏజెన్సీ మండలాల్లో పిసా చట్టం కొరకు శిక్షణ తరగతులు పై ఇచ్చిన ఆదేశాలు మేరకు ఏజెన్సీ షెడ్యూలు ఏరియాలో ఉన్న గిరిజనులు,గిరిజనేతరలు పీసా చట్టం పై అవగాహన కార్యక్రమంలో శిక్షణ పరిశీలన అధికారి శ్రీ రమేష్ పాల్గొన్నారు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి,జెడ్‌పిటిసి,కో- ఆప్టెడ్ సభ్యులు,ఎంపిటిసిలు,సర్పంచ్లు, పీసా గ్రామ సభ ఉప అద్యక్షులు,కార్యదర్శులు,వార్డ్ సభ్యులు, మండల లైన్ డిపార్ట్మెంట్స్ అధికారులు,పంచాయతీ కార్యదర్శులు,సచివాలయం సిబ్బంది,స్వయం సహాయక బృంద సభ్యులకు 13నుండి 22.వరకు ఏర్పాటు చేయబడిన 9 రోజులు పాటు జరుగు పీసా చట్టం పై శిక్షణ తరగతుల కార్యక్రమానికి అందరూ హాజరయ్యి పీసా చట్టం అమలుకు సహకరించాలని తెలిపారు ఈ సందర్భంగా శ్రీ రమేష్ మాట్లాడుతూ పీసా చట్టం అంటే పంచాయతీ రాజ్ చట్టానికి ఎక్స్టెంషన్ అని, షెడ్యూల్ ప్రాంతంలో గిరిజనులు సొంత ఆలోచనలతో స్వయం పరిపాలన చేసుకోవడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు.రాజ్యాంగం కల్పించిన ఈ చట్టం ద్వారా గిరిజనులకు ఎంతో మేలు కలుగుతుందని,విద్య,వైద్యం,ఉపాధి, త్రాగునీరు, అభివృద్ధి తదితర అంశాలలో పీసా గ్రామసభలు ద్వారా స్వయం నిర్ణయాలు తీసుకొని అభివృద్ధి ప్రణాళికలు తయారు చేసి అమలు చేయవచ్చని తెలిపారు ఈటిసి సామర్లకోట శిక్షణ కేంద్రం నుంచి వచ్చిన అబ్జర్వర్ పద్మజ శిక్షణ తరగతుల ఉద్దేశించి అందరూ శిక్షణ కార్యక్రమం ఉపయోగించుకొని పీసా చట్టం పై అవగాహన కల్పించుకోవాలని తెలిపారు మండల అభివృద్ధి అధికారి వారు మాట్లాడుతూ పీసా చట్టం యొక్క ఆవశ్యకతను వివరిస్తూ షెడ్యూల్ ప్రాంతాలలో పీసా చట్టం యొక్క ప్రాముఖ్యతను వివరించారు.ఈ కార్యక్రమంలో ఎంఓటిలు ఎం కోటేశ్వరరావు ఇంచార్జ్ (ఈఓఆర్డి ),పంచాయతీ కార్యదర్శులు కోనేటి రాంబాబు,రొంగల కిశోర్,సుమర్ల రాంబాబు,గోవిందరాజు ,కె బాలురెడ్డి ,వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## 'పీ ఎం శ్రీ ' తో విద్యార్థులకు అవగాహన




శంకరపట్నం (జనం రిపోర్టర్ ): శంకరపట్నం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల పాఠశాలలోని విద్యార్థిని విద్యార్థులకు క్షేత్ర సందర్శన అనుభవాన్ని, జ్ఞానాన్ని, ఆనంద ఉత్సాహాల్ని పెంపొందించే విధంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన "పి ఎం శ్రీ 'పథకం లో భాగంగా ఆరవ తరగతి విద్యార్థుల నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థుల వరకు మొత్తం పాఠశాలలోని విద్యార్థినీ విద్యార్థులు అందరినీ యాదాద్రి జిల్లాలోని 'వన్ డే కిసాన్' ను సందర్శించారు.పి ఎం శ్రీ ప్రైమ్ మినిస్టర్స్ స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా పథకం ద్వారా విద్యార్థులందరికీ ఫీల్డ్ ట్రిప్స్ కి తీసుకువెళ్లే అవకాశం దొరికిందని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ వి. సరిత తెలియజేశారు.

## పోషణ బి పాయె బి శిక్షణా కార్యక్రమం



రేపల్లె (జనం రిపోర్టర్ ):తల్లిపాలు బిడ్డకు ఎంతో ఆరోగ్యాన్నిస్తుందని స్థానిక ఐసిడిఎస్ సి డి పి ఓ సుచిత్ర తెలియజేశారు శుక్రవారం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో అంగన్వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారికి పోషక విలువలు కలిగిన ఆహారం అందించాలన్నారు పోషకాహార లోపాల వలన చిన్నారులు ఇబ్బందులు పడకుండా తగిన జాగ్రత్తలు సలహాలను తొలలకు చూయించాలన్నారు మూడు నుండి ఆరు సంవత్సరాల లోపు చిన్నారులకు తగిన పోషకాహారాలు అందించేలా చర్యలు చేపట్టాలన్నారు వ్యక్తిగత పరిశుభ్రత ఎంతో ముఖ్యమని తెలియజేశారు ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్లు అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు

## తక్షణమే అగ్రిగోల్డ్ బాధితులకు ఆదుకోవాలి. కేతినేని అగస్టీన్




పొన్నూరు(జనం రిపోర్టర్ ):పొన్నూరు సిపిఐ పార్టీ కార్యాలయంలో ఎం. షరీఫ్ అధ్యక్షతన జరిగిన విలేకరుల సమావేశంలో అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కేతినేని అగస్టీన్, ఉపాధ్యక్షులు షేక్ కరిముల్లా, పొన్నూరు నియోజకవర్గం అసోసియేషన్ గౌరవాధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి గుంటూరు జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు విలేకర్ల సమావేశంలో మాట్లాడారు.అగ్రిగోల్డ్ కంపెనీ 8 రాష్ట్రాల్లో 32 లక్షల మందిని 7000 కోట్ల రూపాయలు మన రాష్ట్రంలో 19.52 లక్షల మందిని 3865 కోట్ల రూపాయలు భారీ ఆర్థిక కుంభకోణానికి పాల్పడి 2015 జనవరి 5న కంపెనీ మూతపడటంతో అగ్రిగోల్డ్ బాధితులు రోడ్డున పడ్డారని పేర్కొన్నారు. బాధితులందరూ రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులను మాకు అండగా ఉండి, న్యాయం చెయ్యమని వేడుకున్నా పట్టించుకోకపోవడంతో బాధితులకు అండగా సిపిఐ పార్టీ నిలిచిందని తెలిపారు. సిపిఐ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి కామ్రేడ్ ముప్పాళ్ళ నాగేశ్వరావు గౌరవాధ్యక్షులుగా అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు చేసుకొని, గత 10 సం. నుంచి అనేక శాంతియుత పోరాటాలు చేయటం వాటి ఫలితంగా గత చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో 142 మందికి ఐదు లక్షల రూపాయలు చొప్పున మరణించిన అగ్రిగోల్డ్ బాధిత కుటుంబాలకు ఎక్స్ గ్రేషియో ఇవ్వడం జరిగిందన్నారు. అన్ని పోలీస్ స్టేషన్లో పోలీసులు చేత బాధితుల బాండ్లు నమోదు చేపించడం జరిగింది. 250 కోట్ల రూపాయలు కార్పస్ పండుగ ఇచ్చి, హైకోర్టులో జమ చేయడం జరిగింది. బాధితులకు పూర్తిగా న్యాయం జరగనందున 2019 ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు ను అగ్రిగోల్డ్ బాధితులు ఓట్లు వేయినందున చంద్రబాబు నాయుడు అధికారం కోల్పోయారని అన్నారు. అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న జగన్మోహన్ రెడ్డి మా దీక్షా శిబిరానికి వచ్చి, మన ప్రభుత్వం వచ్చిన వారం రోజుల్లో 1182 కోట్ల రూపాయలు, మరణించిన బాధితులకు 10 లక్షల రూపాయలు ఎక్స్ గ్రేషియో ఇస్తానని ఆరు నెలల్లో బాధితులందరికీ వడ్డీతో సహా చెల్లించి, పూర్తి న్యాయం చేస్తానని యాజమాన్యం సంగతి కోర్టు సంబంధించి నేను చూసుకుంటానని హామీ ఇచ్చి మేనిఫెస్టోలో పెట్టి అగ్రిగోల్డ్ బాధితుల ఓట్లతో అధికారంలోకి వచ్చారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన హామీలను మర్చిపోయా రన్నారు. చంద్రబాబునాయుడు ఇచ్చిన 250 కోట్లకు 14 కోట్లు కలిపి 264 కోట్లకు 230 కోట్లు మరో 676 కోట్లు కలిపి అగ్రిగోల్డ్ బాధితుల ఉద్యమ ఫలితంగా 906 కోట్ల రూపాయలు బాధితులకు ఇవ్వడం జరిగింది. అది మినహా ఏమి న్యాయం జరగలేదు. అందువలన ఇచ్చిన హామీలను మరచిన జగన్మోహన్ రెడ్డి ని 2024 ఎన్నికల్లో అగ్రిగోల్డ్ బాధితులు ఓట్లు వేయకుండా ఇంటికి పంపించడం జరిగిందన్నారు. 2024 ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం అగ్రిగోల్డ్ బాధితులకు పూర్తి న్యాయం చేస్తామని హామీ ఇచ్చి, మేనిఫెస్టోలో పెట్టి, ప్రస్తుతం అగ్రిగోల్డ్ బాధితులు ఓట్లతో అధికారంలోకి వచ్చి ఇచ్చిన హామీల గురించి మాటల్లో చూపిస్తున్నారు. కానీ చేతల్లో కనపడటం లేదు. అందువల్ల మా రాష్ట్ర అసోసియేషన్ అమరావతిలోని జె బి గార్డెన్స్ లో ఈనెల 12,13 తేదీలలో రాష్ట్రస్థాయి సమావేశం జరిపి అందులో కొన్ని నిర్ణయాలు తీసుకోవడం జరిగినది అన్నారు. 19, 20 తేదీల్లో రాష్ట్రంలోని ఎంపీ ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు ఇవ్వాలని, ఈనెల 24వ తేదీన రాష్ట్రంలోని అన్ని కలెక్టర్ల కార్యాలయాల్లో ప్రదర్శనగా వెళ్లి, వినతి పత్రాలు ఇవ్వాలని మార్చి 5వ తేదీ నుండి విజయవాడ కేంద్రంగా రిలే నిరాహార దీక్షలు కొనసాగుతాయని ఆఖరి రోజున గొప్ప ప్రదర్శన ఉంటుందని,ఛలో అసెంబ్లీ నిర్వహించాలని నిర్ణయించామన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే న్యాయం చేయాలని, బడ్జెట్ సమావేశాల్లో అగ్రిగోల్డ్ బాధితులకు పూర్తి న్యాయం జరిగే విధంగా నిర్ణయాలు తీసుకోవాలని కోరారు.

## ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అమలు అడ్మినిస్ట్రేటివ్ అధికారి వి అభిషేక్



రాజవొమ్మంగి,రంపచోడవరం, ఫిబ్రవరి 14 జనం రిపోర్టర్: పోలవరం ప్రాజెక్టు ముంపు బాధితులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అమలు చేయడం జరుగుతుందని పోలవరం ప్రాజెక్ట్ ఆర్ అండ్ ఆర్ ప్యాకేజ్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి వి. అభిషేక్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక. పిఎమ్ఆర్సి జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో పోలవరం ప్రాజెక్ట్ ముంపు బాధితులకు అర్హులైన వారికి ఆర్ అండ్ ప్యాకేజ్ ప్యాకేజీ అమలు చేయుటకు పోలవరం ప్రాజెక్ట్ ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అడ్మినిస్ట్రేటివ్ అధికారి అభిషేక్, రంపచోడవరం సబ్ కలెక్టర్ కెఅర్. కల్ప శ్రీ ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అధికారులతో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలవరం ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి వి. అభిషేక్ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు ముంపు బాధితులకు ప్రభుత్వ నిబంధన ప్రకారం అర్హులైన వారికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజ్ పూర్తిస్థాయిలో పరిశీలించి ప్యాకేజీ అమలు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఇప్పటివరకు చాలా గ్రామాలకు చెందిన ముంపు బాధితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అమలు చేయడం జరిగిందని అదేవిధంగా రంపచోడవరం డివిజన్లో రెండు, చింతూరు డివిజన్లో నాలుగు ఆర్ అండ్ ఆర్ కాలనీలో ఏర్పాటు చేయుటకు తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. పోలవరం ప్రాజెక్ట్ ముంపునకు గురైన గిరిజనులకు గంగవరం మండలంలోని నేల దోనెలపాడు గ్రామంలో ల్యాండ్ టు ల్యాండ్ ఏర్పాటు చేయుటకు తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. గిరిజనేతరులు గోకవరంలో చాలామందికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ గృహాలు ఏర్పాటు చేయడం జరిగిందని అదేవిధంగా ఇంకా కొన్ని గృహాలు ఏర్పాటు చేయవలసి ఉందని ఇవి కూడా త్వరలో పూర్తి చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.చింతూరు డివిజన్లోని జులై ఆగస్టు నెలలలో వచ్చే వరదలకు ముందుగా కొన్ని ఆర్ అండ్ ఆర్ కాలనీల జరుగుతున్న పనులను పూర్తిచేసే విధంగా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. ముందుగా ముసిని కుంట ఆర్ అండ్ ఆర్ కాలనీలు సందర్శించి వారి సమస్యలకు సంబంధించిన వినతి పత్రములు తీసుకోవడం జరిగిందని అదేవిధంగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన ముంపు బాధితులకు పూర్తిస్థాయిలో పరిశీలించి వారి అర్హతను బట్టి నివేదికల ప్రకారం ప్యాకేజీ రాని వారికి ప్యాకేజీ అమలు కొరకు తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అంబేద్కర్, తాసిల్దార్ కరక సత్యనారాయణ,డిప్యూటీ తాసిల్దార్ త్రిమూర్తులు, సీనియర్ అసిస్టెంట్ దాసు తదితరులు పాల్గొన్నారు.

## దళిత విద్యార్థి చేతులు నరికేసిన వారిని కఠినంగా చర్యలు తీసుకోవాలి డి ఎచ్ పి ఎస్ డిమాండ్




మడకశిర (జనం రిపోర్టర్ ):బుల్లెట్ బండి నడుపు తున్నాడని దళిత విద్యార్థి చేతులు నరికేసిన దారుణ ఘటన తమిళనాడులో చోటు చేసుకుంది.శివగంగై జిల్లా మానమదురైకి చెందిన దళిత యువకుడు అయ్యసామి స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళా శాలలో మూడో ఏడాది చదువు తున్నాడు అతడికి బుల్లెట్ బైక్ ఉండటం అగ్రవర్ణ సామాజిక వర్గానికి చెందిన ముగ్గురు యువకులకు కంటగింపుగా మారింది బుధవారం అయ్య సామి తరగతులు ముగిసిన తర్వాత బుల్లెట్ బండిపై ఇంటికి వెళ్తుండగా ముగ్గురు విద్యార్థులు అడ్డుకుని 'షెడ్యూల్డ్ కులంలో పుట్టిన నువ్వు బుల్లెట్ ఎలా నడుపు తావు అంటూ రెండు చేతులూ నరికేశారు అనంతరం బాధిత విద్యార్థి ఇంటికెళ్లి విధ్వంసం సృష్టించారు పై ఘటనలో తీవ్రంగా గాయపడిన యువకుడు ప్రస్తుతం మదురై రాజాజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.అతడికి చేతులు అతికించే శస్త్రచికిత్స నిర్వహించనున్నారు.ఘటనపై పోలీసులు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దాడికి పాల్పడి న వినోద్,ఆది ఈశ్వరన్, వల్లరసులను అరెస్టు చేశారు. ఎన్నో పదునైన చట్టాలు వున్నా గాని దళితుల మీద ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతూనే వున్నాయి కేవలం ఇలా అరెస్టులతోనే కాకుండా పూర్తిగా నివారణ చర్యలు కూడా తీసుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని దళిత హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం అర్ హనుమంతు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.

## అటవీ సంరక్షణ పై అవగాహన సదస్సు.. పరిసర గ్రామల ప్రజలకు అవగాహన సదస్సులు

కుక్కునూరు : మండలం అమరవరం అటవీ రేంజ్ పరిధిలోని పరిసర గ్రామాల్లో అడవుల సంరక్షణపై అటవీశాఖ అధికారులు అవగాహన సదస్సులను ఏర్పాటు చేశారు. వేసవిలో అగ్ని ప్రమాదాల నుంచి అటవీ ప్రాంతాన్ని రక్షించుకొని, భావితరాలకు అందివ్వాల్సిన అవసరం ఉందని అమరవరం అటవీ రేంజ్ అధికారి సత్య పద్మజ అన్నారు. రేంజ్ పరిధిలోని అమరవరం బీట్ పరిధిలోని దామరచర్ల, రెగులచెరువు అటవీ ప్రాంతాల్లో శుక్రవారం 'అటవీ రక్షణ-వన్యప్రాణుల సంరక్షణ, అడవి-నిప్పు నియంత్రణ'పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భూమి మీద ప్రాణాలతో ఉండే ప్రతి ప్రాణికి అటవీ ప్రాంతం కీలకమన్నారు. అడవి సస్యశ్యామలంగా ఉంటేనే అందరూ ఆరోగ్యంగా ఉంటారన్నారు. అందుకే అడవిని కాపాడుకోవడానికి అందరం సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అటవీ ప్రాంతంలో అన్ని రకాల వన్యప్రాణులు జీవించే విధంగా వాతావరణం అనుకూలంగా ఉందన్నారు. వన్యప్రాణులను వేటాడితే బాధ్యులైన వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. వేసవి కాలంలో అడవుల్లో తరచూ అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. వేసవిలో ఆకులు ఎండిపోయి నేలరాలుతాయి. ఎవరైనా నిప్పు పెడితే అడవులు మంటలు పెద్ద మొత్తంలో అంటుకుని అడవులకు నష్టం వాటినే ప్రమాదం ఉంది. దీంతో చెట్లు కాలిపోవడంతో పాటు అటవీ ప్రాంతంలో ఉండే వన్యప్రాణులకు సైతం ముప్పు వాటిల్లుతుంది.నష్టాన్ని తగ్గించాలంటే వన్య సంరక్షణపై ప్రజలందరిలో చైతన్యం రావాలని, అడవులను రక్షించడం మనందరి బాధ్యత అన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో బీట్ ఆఫీసర్ వెంకన్న బాబు, డిఆర్ఓలు అశోక్ కుమార్,జగదీష్, అటవీశాఖ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## తక్షణమే సమస్యలు పరిష్కరించిన ఎంపీడీవో ప్రేమ్ సాగర్... కృతజ్ఞతలు తెలిపిన విద్యార్థులు, ఉపాధ్యాయుడు..

డుంబ్రిగుడ : మండలంలోని అరమ పంచాయతీ పుల్గాడ మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల లో ఉన్న మంచినీరు అందించే బోరు మరమ్మత్తులకు గురవడంతో పాఠశాల విద్యార్థులు పలు ఇబ్బందులు పడ్డారు. దీంతో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీను బోరు మరమ్మత్తులు చేపట్టాలని మండల అభివృద్ధి శాఖ అధికారి ప్రేమ్ సాగరకు వినతి పత్రం అందించారు. దీంతో మండల అభివృద్ధి శాఖ అధికారి ప్రేమ్ సాగర్ తక్షణమే స్పందించి అప్పటికప్పుడే మంచినీటి అందించే బోరును మరమ్మత్తులు చేయించి విద్యార్థులకు నిరంధించడంతో ఆ పాఠశాల విద్యార్థులతో పాటు ఉపాధ్యాయుడు, విద్యార్థుల తల్లిదండ్రులు మండల అభివృద్ధి శాఖ అధికారి ప్రేమ్ కుమార్ కు కృతజ్ఞతలు తెలిపి ఇటువంటి అధికారులు ఉంటే ఎటువంటి సమస్యలు అయినా తక్షణమే పరిష్కరిస్తారని ఆయా విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు. ఏదేమైనాప్పటికీ విద్యార్థులకు అందించే మంచినీటి బోరు తక్షణమే మరమ్మత్తు చేయించడం వల్ల ఇటువంటి అధికారిని మెచ్చుకోక తప్పడం లేదు...

## ప్రభుత్వ కార్యాలయాల ఎదుట కాలుష్యం లో కాలువ

అమలాపురం:అమలాపురం సమీపంలోని ఉప్పలగుప్తం మండల లో ప్రభుత్వకార్యాలయాల సముదాయంలో రెవెన్యూ కార్యాలయం ఎదురుగా ప్రవహించే ప్రదాన పంటకాలువ కలుషిత మై జంతు కళేభాలతో ప్లాస్టిక్ కవర్లతో వ్యర్థ పదార్దములు తో చెత్తపెరిగిపోయి కంపు కొడుతు న్నా సంబంధిత అధికారులు పట్టించుకొనక పోవడంపై పలు విమర్శలు తలెత్తు తున్నాయి. కాలువకు అటు వైపు నివాస గృహాలు ఇటువైపు ప్రభుత్వకార్యాలయాలు వున్నాయి. ప్రభుత్వకార్యాలయాలకు వచ్చేవారు కాలువకు అటువైపు నివశించేవారు కంపు భరించలేకపోతున్నా మని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్రోల్మెంట్ ఉన్నకాలువ నీరు కలుషితం కావడంతో ఈ నీరు పశువులకు కూడా వినియోగించుకునేందుకు ప్రయోజనకరంగాలేదని విమర్శిస్తున్నారు. ఇదేకాలువ కుండలేశ్వరంనుండి ఆదిలక్ష్మి పురం వరకు ప్రవహిస్తు ఎన్నో వేల యకరాల ఆయకట్టు కు సాగునీరు అందవలసివుంది కాని వ్యర్థ పదార్థాలు తో కలుషితమవడంతో శివారు పంట చేలకు నీరందక రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కాలువ ప్రక్క నివాసులు ఇదే నీటని నిత్యం ఉపయోగిస్తారు . సంబందిత అధికారులు వెంటనే స్పందించి కాలువలోని వ్యర్ద పదార్థాలు తొలగించి పంటకాలువ కలుషితం కాకుండా చర్యలు చేపట్ట వలసిందిగా ప్రజలు రైతులు కోరుతున్నారు.

## నీటి ఎద్దడి రాకుండా.. నివారణ చర్యలు చేపట్టిన... పంచాయతీ సెక్రెటరీ అంకన్న

గడివేముల: నంద్యాల జిల్లా పాణ్యం నియోజకవర్గం గడివేముల మండల పరిధిలోని స్థానిక మండల పరిషత్ కార్యాలయం నందు 11 వతేదీన జరిగిన సర్వసభ్య సమావేశంలో పాణ్యం నియోజకవర్గ శాసనసభ సభ్యురాలు శ్రీమతి గౌరు చరిత రెడ్డి మాట్లాడుతూ గడివేముల మండలంలోని గ్రామాలలో రానున్న వేసవికాలంలో నీటి ఎద్దడి రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆర్డబ్ల్యూఎస్ మరియు గ్రామపంచాయతీ అధికారులను ఆదేశింపగా, గడివేములలో గ్రామంలో నిరుపయోగంగా ఉన్న చేతి పంపులను గుర్తించి,నీటిఎద్దడి రాకుండా నివారణ చర్యలు తీసుకోవాలని గడివేముల మండల టిడిపి కన్వీనర్ దేశం సత్యనారాయణరెడ్డి,సర్పంచ్ ఎక్కలదేవి రమణమ్మలు గడివేముల గ్రామ పంచాయతీ కార్యదర్శి అంకన్న దృష్టికి తీసుకురాగా ఆర్డబ్ల్యూఎస్ ఏఈ పవన్ ఆధ్వర్యంలో పంచాయతీ సెక్రటరీ అంకన్న, రంగస్వామి మరియు గ్రామపంచాయతీ సిబ్బంది గ్రామంలో నిరుపయోగంగా ఉన్న చేతి పంపులకు మరమ్మత్తు చేస్తూ గ్రామప్రజలు వేసవికాలంలో నీటి ఎద్దడిని ఎదుర్కొనకుండా నివారణ చర్యలు తీసుకుంటుండడంతో గ్రామ ప్రజలు వేసవికాలంలో నీటి ఎద్దడికి గురికాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించిన పాణ్యం నియోజకవర్గ శాసనసభ సభ్యురాలు శ్రీమతి గౌరు చరిత రెడ్డి గారికి,గ్రామ అభివృద్ధికి తోడ్పడుతున్న టిడిపి మండల కన్వీనర్ దేశం సత్యనారాయణరెడ్డి,సర్పంచ్ ఎక్కలదేవి రమణమ్మ, గ్రామపంచాయతీ సెక్రటరీ అంకన్నకు మరియు సిబ్బందికి గడివేముల గ్రామ

## భారత్‌లో మౌనం.. అమెరికాలో వ్యక్తిగతమా!



న్యూఢిల్లీ : భారత ప్రధాని నరేంద్ర మోడీ అమెరికా రెండు రోజుల పర్యటనలో భాగంగా.. అదానీ వ్యవహారంపై కీలక వ్యాఖ్యలు చేశారు. పర్యటనలో భాగంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత ప్రధాని మోడీ సంయుక్తంగా మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో గౌతమ్ ఆదానీ కేసు గురించి అధ్యక్షుడు ట్రంప్‌తో చర్చించారా? అని మోడీని మీడియా ప్రతినిధి ప్రశ్నించారు. ఈ విషయంపై మోడీ స్పందిస్తూ.. 'భారతదేశం ప్రజాస్వామ్య దేశం. మన దేశం.. సంస్కృతి.. తత్వశాస్త్రానికి సంబంధించి ప్రపంచం మొత్తం ఒక కుటుంబం అనే అర్థం. ప్రతి భారతీయుడు నా కుటుంబ సభ్యుడే. గౌతమ్ అదానీ కేసుకు సంబంధించిన విషయానికొస్తే.. రెండు దేశాలకు చెందిన ఇద్దరు నేతలు ఆ అంశంపై ఒకచోట చేరి చర్చించరు. ఇది మా వ్యక్తిగత విషయం' అని ఆయన అన్నారు. ప్రధాని మోడీ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నాయకులు, లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ ఫైర్ అయ్యారు. 'అదానీ కేసుకు సంబంధించి దేశంలో మిమ్మల్ని ప్రశ్నిస్తే మౌనం వహిస్తారు. అదే ప్రశ్న అమెరికాలో అడిగితే.. వ్యక్తిగత విషయం అని దాటేస్తారు. ప్రధాని మోడీ అదానీ అవినీతిని కప్పిపుచ్చుతారు. మిత్రుని జేబు నింపడం మోడీజీకి 'దేశ నిర్మాణం' అయితే.. లంచాలు తీసుకోవడం, దేశ సంపదను దోచుకోవడం 'వ్యక్తిగత విషయం' అని రాహుల్ సామాజిక మాధ్యమం ఎక్స్ పోస్టులో మోడీని తీవ్రంగా విమర్శించారు.

## కర్ణాటకలో ప్రారంభమైన కుంభమేళా



మైసూరు: కర్ణాటకలో 13వ చరిత్రాత్మక కుంభమేళా ప్రారంభమైంది. మైసూరు జిల్లా టి.నరసిపురలోని కావేరి, కపిల, స్పటికా సరోవర నదులు కలిసే త్రివేణి సంగమంలో కుంభమేళా మొదలైంది. కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొని పుణ్యస్నానాలు ఆచరించారు. రాష్ట్రం నలుమూలల నుంచి, ఇతర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు, సాధువులు తరలివచ్చారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లడానికి బదులుగా కర్ణాటకలో జరిగే కుంభమేళాకు హాజరుకావాలని భక్తులను కోరారు. "త్రివేణి సంగమంలో భాగమైన గంగా, యమున, సరస్వతి నదులకు ఎలాగైనా దైవత్వం, స్వచ్ఛత ఆపాదించారో కావేరి నదికి సైతం అంతే ప్రాశస్త్యం ఉందని మన పురాణాల్లో పేర్కొన్నారు. అందుకే ప్రయాగ్‌రాజ్ మహాకుంభ్‌కు వెళ్లి అక్కడ కిక్కిరిసన జనం మధ్య ఇబ్బందులు పడే బదులు కర్ణాటకలో దక్షిణభారత ప్రయాగ్‌రాజ్‌గా వినతికెక్కిన టి.నరసిపుర త్రివేణి సంగమ స్థలికి విచ్చేయండి. పుణ్యస్నానాలు ఆచరించండి. అత్యంత పటిష్టవంతంగా, భక్తులకు సౌకర్యవంతంగా ఇక్కడ కుంభమేళాకు ఏర్పాట్లుచేశాం"అని భక్తులకు శివకుమార్ పిలుపునిచ్చారు.

## అమెరికాలోకి భారతీయుల వలసలు..
## ట్రంప్‌తో మోదీ ఏమన్నారంటే..



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో భేటీ అనంతరం భారతీయుల అక్రమ వలసలపై ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న భారతీయులను స్వదేశానికి తీసుకొస్తామని ప్రకటించారు. ఒక దేశంలోకి చట్టవిరుద్ధంగా ప్రవేశించిన వారికి అక్కడ నివసించే హక్కు లేదని చెప్పుకొచ్చారు. వైట్‌హౌస్‌లో అధ్యక్షుడు ట్రంప్‌తో మోదీ భేటీ అయ్యారు. ఈ క్రమంలో ఇద్దరు దేశాధినేతలు పలు కీలక అంశాలపై చర్చించారు. అలాగే, అమెరికాలోకి అక్రమంగా వెళు _న్న భారతీయుల అంశంపై మోదీ స్పందించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ..'అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న భారతీయులను స్వదేశానికి తీసుకొస్తాం. మానవ అక్రమ రవాణాను అడ్డుకోవడానికి ప్రయత్నాలు జరగాల్సి ఉంది. ఒక దేశంలోకి చట్టవిరుద్ధంగా ప్రవేశించిన వారికి అక్కడ నివసించే హక్కు ఉండదు. ఈ విధానం ప్రపంచం అంతటికీ వర్తిస్తుందన్నారు.

### అమెరికా టూర్లో మోదీకి ట్రంప్ స్పెషల్ గిఫ్ట్

యువత, పేదరికంలో ఉన్నవారు మోసపూరితంగా వలసదారులు గా మారుతున్నారు. డబ్బు, ఉద్యోగాల ఆశజూపి కొంతమంది వీరిని మోసం చేస్తున్నారు. అలా వారు అక్రమ వలసదారులుగా మారుతున్నారు. వారికి తెలియకుండానే మానవ అక్రమ రవాణా కూపంలోకి వెళ్తున్నారు. ఈ దారుణాలను సమూలంగా నిర్మూలించాల్సిన అవసరం ఉంది. ఈ ప్రయత్నాల్లో భారత్‌కు ట్రంప్ పూర్తి సహకారం అందిస్తారని ఆశిస్తున్నాం' అని అన్నారు. ఇక, అమెరికాలో అక్రమంగా నివాసం ఉంటున్నారని ఇటీవల 104 మంది భారతీయులను అమెరికా వెనక్కి పంపిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా, అంతకుముందు.. వెస్ట్ వింగ్ లాబీలో భారత ప్రధాని నరేంద్రమోదీకి అమెరికా అధ్యక్షుడు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇరు దేశాధినేతలు ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. ఈ సమయంలో మిమ్మల్ని చాలా మిస్సయ్యా అంటూ మోదీతో ట్రంప్ వ్యాఖ్యలు చేశారు. నాకు కూడా మిమ్మల్ని చూడటం ఆనందంగా ఉందని భారత ప్రధాని మోదీ బదులిచ్చారు. ఇదే సమయంలో ట్రంప్ గతంలో? భారత్ పర్యటనకు వచ్చిన సందర్భంగా దిగిన ఫోటోలను ఇద్దరు నేతలు తిలకించారు. ఈ క్రమంలో మోదీకి పుస్తకాన్ని ట్రంప్ బహుమతిగా ఇచ్చారు.

## దేవాలయంలో ఏనుగుల తొక్కిసలాట..
## ముగ్గురు మృతి, 24మందికి గాయాలు



తిరువనంతపురం : కేరళలో విషాదం చోటు చేసుకుంది. పటాకుల శబ్దానికి బెదిరిపోయిన ఏనుగులు భక్తుల్ని తొక్కి చంపినట్లు తెలుస్తోంది. ఈ దుర్ఘటనలో ముగ్గురు భక్తులు మరణించగా, 24 మంది తీవ్రంగా గాయపడినట్లు సమాచారం. బాధితుల్ని అత్యవసర చికిత్స నిమిత్తం ఆస్పత్రి తరలించారు. పోలీసుల సమాచారం మేరకు.. కేరళలోని కోజికోడ్ జిల్లాలోని కోయిలాండి సమీపంలో కురవంగడ్‌లోని మనక్కులంగర భగవతి ఆలయ ప్రాంగణంలో వార్షిక ఉత్సవం జరిగింది. ఉత్సవం చివరి రోజున నిర్వాహకులు రెండు ఏనుగుల్ని తీసుకువచ్చారు. ఉత్సవ సమయంలో నిర్వాహకులు బాణసంచా పేల్చారు. దీంతో ఆ రెండు ఏనుగులు బెదిరిపోయాయి. భక్తుల్ని తొక్కుకుంటూ, దాడులు చేస్తూ ఆ ప్రాంతం నుంచి పరుగులు తీశాయి. ఈ దుర్ఘటనలో ముగ్గురు భక్తులు మరణించగా.. 24 మంది గాయపడ్డారు. 'ఈ దుర్ఘటన గురువారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో జరిగింది. ఏనుగులను సాయంత్రం ఊరేగింపు కోసం ప్రదర్శిస్తుండగా, పటాకుల శబ్దం విన్న తర్వాత అకస్మాత్తుగా వాటిలో ఒక ఏనుగు బెదిరిపోయింది. మరో ఏనుగుతో ఘర్షణకు దిగింది. ఆ సమయంలో భక్తుల మధ్య తోపులాట జరిగింది. ఏనుగులు ఒకదానికొకటి తోసుకోవడంతో తాత్కాలికంగా ఏర్పాటు ఉత్సవ కార్యాలయం కూడా కూలిపోయింది' అని కౌన్సిలర్ చెప్పారు. దేవాలయంలో దుర్ఘటనపై సమాచారం అందుకున్న అటవీ శాఖ సిబ్బంది రెండు ఏనుగుల్ని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు క్రాకర్ల శబ్దానికి ఏనుగులు బెదిరిపోవడం వల్లే విషాదం చోటు చేసుకున్నట్లు ప్రాథమికంగా తేలింది. కోయిలాండి ఎమ్మెల్యే కనాతిల్ జమీలా మీడియాతో మాట్లాడుతూ.. క్రాకర్ల శబ్దానికి ఏనుగులు బెదిరిపోయాయి. అక్కడి నుంచి పారిపోయేందుకు ప్రయత్నించాయి. ఆ సమయంలో భక్తుల మధ్య తొక్కిసలాట, తోపులాట జరిగింది. గాయపడిన 24 మందిని ఆసుపత్రికి తరలించాము' అని అన్నారు.

# నొప్పించక, తానొవ్వక...



అగ్రరాజ్యాధిపతిగా రెండోసారి అధికారంలోకి వచ్చాక డొనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న అనేక నిర్ణయాలు వివాదాస్పదంగా మారుతున్నాయి. అంతకుమించి, ప్రపంచ దేశాల మీద అవి ప్రతికూల ప్రభావాన్ని కనబరుస్తున్నాయనడంలో సందేహం లేదు. ఈ జాబితాలో చిరకాల మిత్రదేశం భారత్ కూడా ఉండటమే ఆందోళన కలిగిస్తున్న విషయం. ఈ నేపథ్యంలో భారత ప్రధాని నరేంద్ర మోడీ, ట్రంప్ మధ్య గురువారం జరగబోతున్న ద్వైపాక్షిక సమావేశానికి ఎనలేని ప్రాధాన్యం ఏర్పడింది. వాషింగ్టన్ వేదికగా జరగబోయే ఈ భేటీలో అక్రమ వలసలు, సుంకాల విధింపు, రక్షణరంగ సహకారం వంటి అనేక కీలక విషయాలు చర్చకు వచ్చే ఆస్కారం ఉన్నందున ఎవరిది పైచేయి అవుతుందా అనే ఉత్కంఠ నెలకొంది. 'ట్రంప్ తొలిసారి అధ్యక్షుడిగా పనిచేసిన సమయంలో ఆయన ప్రభుత్వం భారత్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యం బలపడటానికి సహకరించింది. ఇప్పుడు దాన్ని కొనసాగించే అవకాశం లభించింది' అంటూ ప్రధాని మోడీ ఆశాభావం వ్యక్తం చేసినప్పటికీ, అది అంత సులభంగా జరిగే పనికాదనే సంగతి తాజా పరిణామాలను బట్టి స్పష్టమవుతోంది. వాస్తవానికి ఇరువురు అగ్రనేతల మధ్య స్నేహసంబంధాలు ఉన్నప్పటికీ, అగ్రరాజ్యానికి ఆసియాలో భారత్ చెప్పుకోదగిన మిత్రదేశమన్న సంగతి జగమెరిగిన సత్యమైనప్పటికీ, భారత్ పట్ల ట్రంప్ వైఖరిలో మార్పు వచ్చిందనేది వాస్తవం. సహజంగానే దూకుడుతో వ్యవహరిస్తూ, దుందుడుకు నిర్ణయాలు తీసుకునే స్వభావం గల ట్రంప్ రెండోసారి అధ్యక్షుడయ్యాక మరింత అనాలోచిత నిర్ణయాలు తీసుకుంటూ ప్రపంచ దేశాల ప్రయోజనాలను దెబ్బతీస్తున్నారు. వచ్చీ రాగానే అక్రమ వలసదారులపై విరుచుకుపడటమే కాదు, ఒక్కొక్కరిపై అధికమొత్తంలో డబ్బు వెచ్చించి, సంకెళ్లు వేసి మరీ తిరుగుటపాలో పంపిస్తున్నారు. ఈ విషయంలో భారత్‌కూ ఆయన మినహాయింపు ఇవ్వలేదు. అంతేకాదు, కీలక వాణిజ్య భాగస్వామిగా ఉన్న భారత్ పై అధిక సుంకాలు విధించేందుకు సైతం రంగం సిద్ధం చేస్తున్నారు. గడచిన ఆర్థిక సంవత్సరం భారత్- అమెరికా దేశాల మధ్య 120 బిలియన్ డాలర్ల మేరకు వాణిజ్యం జరిగింది. ఇందులో భారత్ ఎగుమతుల కంటే, అమెరికానుంచి దిగుమతయ్యే ఉత్పత్తుల వాటాయే ఎక్కువ. అయినా ఇవేమీ ఆయనకు పట్టడం లేదు. అమెరికా ఉత్పత్తులపై భారత్ అధిక సుంకాలు విధిస్తోందంటూ విమర్శించే ట్రంప్, అవకాశం వచ్చినప్పుడల్లా భారత్ ను 'టారిఫ్ కింగ్' గా ఎద్దేవా చేస్తూ ఉంటారు. కానీ, అధిక సుంకాలు విధించడంలో అమెరికా తక్కువేం తినలేదు. ఆ దేశంనుంచి దిగుమతయ్యే విస్కీలాంటి ఉత్పత్తులపై భారత్ ఎక్కువ సుంకాలు విధిస్తుంటే, పొగాకు వంటి భారతీయ ఉత్పత్తులపై అమెరికా అంతకు రెట్టింపు సుంకాలు వసూలు చేస్తోంది. ఈ విషయంలో అగ్రరాజ్యంతో కలహానికి కాలు దువ్వకుండా, భారత్ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. బడ్జెట్లో లగ్జరీ కార్లు, మోటార్ సైకిళ్లు, లిథియం అయాన్ బ్యాటరీలు, సెల్ ఫోన్ విడిభాగాలపై కస్టమ్స్ డ్యూటీని తగ్గించడం ద్వారా ట్రంప్ కోపాన్ని తగ్గించే దిశగా పలు చర్యలు చేపట్టింది. దీనివల్ల హార్లే డేవిడ్సన్, టెస్లా, యాపిల్ వంటి అనేక అమెరికన్ కంపెనీలకు లాభం చేకూరుతుంది. ఇదే విషయాన్ని ద్వైపాక్షిక భేటీలో ప్రస్తావించి, సుంకాల విధింపు విషయమై పరస్పర ఒడంబడికను కుదుర్చుకుని, వాణిజ్యబంధాన్ని బలోపేతం చేసుకునే దిశగా ప్రధాని అడుగులు వేస్తారని ఆశించవచ్చు. భారత్- అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్యంలో రక్షణరంగ సహకారం కూడా కీలకమైనది. ఇప్పటికే చినూక్ హెలికాప్టర్లు, సాయుధ డ్రోన్లు వంటి వాటిని అమెరికా నుంచి దిగుమతి చేసుకునేందుకు సంసిద్ధత వ్యక్తం చేసిన భారత్, యుద్ధ విమానాల కొనుగోలు విషయంలో అమెరికా ఒత్తిళ్లకు లొంగడం లేదు. ఫ్రెంచ్ రఫేల్, రష్యన్ సుఖోయ్ విమానాలవైపు మొగ్గు చూపిస్తున్న భారత్‌ను దారికి తెచ్చుకుని తమ అధునాతన ఫైటర్ జెట్లను ఇండియాకు విక్రయించాలన్నది అమెరికా అభిమతం. ఈ విషయంలో ట్రంప్ బుట్టలో పడకుండా నేర్పుగా వ్యవహరించడం ముఖ్యం. అగ్రనేతల భేటీలో హెచ్1బి వీసాల విషయం కూడా ప్రధానంగా చర్చకు వచ్చే ఆస్కారం ఉంది. తమ దేశానికి నిపుణుల అవసరం ఉందని ట్రంప్ స్వయంగా అంగీకరించిన నేపథ్యంలో హెచ్1బి వీసాలపై అమెరికాకు వెళ్లే భారతీయ టెక్ నిపుణులకు ఆటంకాలు ఎదురుకాకుండా చూడవలసిన అవసరం ఉంది. తన మాట వినని దేశాలను నయానో భయానో దారికి తెచ్చుకోవడం ట్రంప్ నైజం. అధిక సుంకాలు విధిస్తామని భయపెట్టి కొలంబియా, మెక్సికోలను దారికి తెచ్చుకున్నట్లే భారత్‌ను కూడా గుప్పిట్లో పెట్టుకోవాలనుకుంటున్న ట్రంప్ ఎత్తుగడలకు చిత్తుకాకుండా నొప్పించక తానొవ్వక అన్న చందంగా నేర్పరితనంతో కాగల కార్యాన్ని సాధించుకురావలసిన అవసరం ఉంది.

# జీవుల పుట్టుకను వివరించిన డార్వినిజం



అనంతమైన ఈ విశ్వంలో జీవుల ఆవిర్భావం ఒక అంతుచిక్కని ప్రశ్నగా మిగిలింది. ఆ సమయంలో అనేక మంది శాస్త్రవేత్తలు పలు రకాల ఆలోచనలను వెలిబుచ్చారు. కానీ అవి శాస్త్రీయతకు నిలబడలేక పోయాయి. ఈ క్రమంలోనే జీవుల పుట్టుకపై పెద్దఎత్తున చర్చకు దారితీసిన గొప్ప సిద్ధాంతం చార్లెస్ డార్విన్ జీవపరిణామం. ఇది జీవుల పుట్టుక, పూర్వోత్తరాలను ఛేదించడంలో అగ్రభాగాన నిలబడింది. భూమిపై జీవజాల పరిణామ క్రమం ఏ విధంగా జరిగిందనే విషయం మీద పరిశోధనలు చేసి, జీవపరిణామ సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. విజ్ఞాన శాస్త్రంలో దీన్ని ఒక మౌలికమైన భావనగా భావిస్తారు. చార్లెస్ రాబర్ట్ డార్విన్ ఇంగ్లాండ్‌కు చెందిన ఒక గొప్ప పకృతివాదిగా పేరుపొందాడు. ఆయన 1809 ఫిబ్రవరి 12న ఇంగ్లాండులో జన్మించాడు. ఈ రోజున ప్రతి ఏటా ప్రపంచవ్యాప్తంగా డార్విన్ డే జరుపుకుంటారు. పారిశ్రామిక విప్లవ కాలంలో చార్లెస్ డార్విన్ కన్నా ముందు జీవశాస్త్రంలో అనేక నూతన ఆవిష్కరణలు జరిగినాయి. అయినప్పటికి జీవుల పుట్టుక, పరిణామంపై సమగ్రమైన వివరణ ఇవ్వడంలో సఫలం కాలేకపోయారు. తదుపరి వచ్చిన చార్లెస్ డార్విన్ మనిషి కోతి నుంచి వచ్చాడని, మనిషిని దేవుడు సృష్టించలేదనే అంశాన్ని తెర మీదికి తెచ్చాడు. ఇది శాస్త్ర ప్రపంచంలో తీవ్రమైన వాదోపవాదాలకు దారితీసింది. సామాజికంగా, మతపరంగా విపరీతమైన వివాదానికి కూడా దారితీసిందని చెప్పవచ్చు.

### జీవ పరిణామం

డార్విన్ సిద్ధాంతం అనేక పరిశోధన, అధ్యయనాలతో రూపుదిద్దుకున్నది. ఊహాత్మక సిద్ధాంతం కాదు. డార్విన్ ప్రకృతి పరిశీలన నిమిత్తం బీగల్ అనే నౌకలో ప్రపంచ యాత్ర చేసి జీవుల భిన్న లక్షణాలపై సమగ్రమైన వివరణ ఇచ్చాడు. ఈ భూమి మీద మానవునితో సహా ఇప్పుడున్న జీవజాతులు యథాతథంగా సృష్టించబడ్డాయన్న వాదనను సవాలు చేశాడు. దీనికి తన జీవ పరిణామ సిద్ధాంతం ఆధారంగా పరిష్కారం చూపాడు. అయితే ఆ నాడు జీవ పరిణామ సిద్ధాంతాన్ని సాంప్రదాయవాదులు తిరస్కరించారు. కానీ డార్విన్ పరిణామ క్రమంలో జీవులు ఆవిర్భవించాయని 'జాతుల ఆవిర్భావం' అనే గ్రంథంలో చెప్పాడు. 1859 నవంబర్ 24న 'జాతుల పుట్టుక' (ది ఆరిజిన్ ఆఫ్ ది స్పీసిస్) అనే గ్రంథాన్ని వెలువరించి సంచలనం సృష్టించాడు. ఇది ప్రపంచంలోకెల్లా అత్యంత ప్రభావవంతమైన పుస్తకంగా గుర్తింపు పొందింది. జీవ పరిణామానికి ప్రకృతి వరణం కారణమని తిరుగులేని విధంగా నిరూపించాడు డార్విన్. జీవులలో భిన్నత్వం ఉంటుందని, ఒక తల్లికి పుట్టిన బిడ్డల్లో కూడా భిన్నత్వం ఉంటుందని పేర్కొన్నాడు. సృష్టిలోని పర్యావరణ పరిస్థితులకు అనుకూలమైన లక్షణాలున్న జీవులు బతుకుతాయి. ఆ లక్షణాలను తమ సంతతికి కూడా ఇస్తాయని తన "ప్రకృతి వరణం" అనే సిద్ధాంతంలో పేర్కొన్నాడు. అంటే మనుగడ కోసం జరిగే పోరాటంలో ప్రకృతిని తట్టుకోగల జీవులు బతుకుతాయాని, మిగిలినవన్నీ నశిస్తాయనే సూత్రాన్ని ఆయన చెప్పాడు.

### డార్వినిజం ప్రాధాన్యత

నాటి మత గ్రంథాలు, సాంప్రదాయవాదులు చార్లెస్ డార్విన్ వాదనను ఎంతగా వ్యతిరేకించినప్పటికీ జీవుల గురించి అవగాహన చేసుకోవడానికి ఆయన "పరిణామ వాదం" ఎంతగానో దోహదపడింది. మరోవైపు అనేక మంది యువకులు జీవ శాస్త్రం పట్ల ఆసక్తి పెంచుకొని ఆ దిశలో పరిశోధనలు ప్రారంభించడానికి డార్విన్ "నేచురల్ సెలెక్షన్" గ్రంథం స్ఫూర్తినిచ్చింది. అదే విధంగా ఆధునిక జీవ శాస్త్రంలో డార్వినిజం జీవుల పుట్టుక, పరిణామంపై ప్రజల్లో ఉన్న మూఢనమ్మకాలను ఛేదించడంలో కీలక పాత్ర పోషిస్తూ శాస్త్రీయ ఆలోచనలకు పునాది వేసింది. కానీ భారతదేశంలో కొంత కాలంగా సూడో సైన్స్ మేధావి వర్గం, పాలకవర్గం పలు వేదికల మీద భారతీయ శాస్త్ర విజ్ఞానంతో పాటు ప్రపంచ శాస్త్ర విజ్ఞానానికి వక్రభాష్యం పలకడం మొదలు పెట్టింది. గతంలో జరిగిన జలంధర్ సైన్స్ కాంగ్రెస్‌లో ఓ ప్రముఖ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ చార్లెస్ డార్విన్ సిద్ధాంతాన్ని మన పురాణాల్లోని "మత్స్యావతారం"గా పేర్కొన్నారు! నాలుగేళ్ల క్రితం కేంద్ర మానవ వనరుల శాఖ సహాయ మంత్రిగా వున్న సత్యపాల్ సింగ్ అయితే ఏకంగా డార్విన్ సిద్ధాంతం తప్పని, దాన్ని సైన్స్ పాఠ్య పుస్తకాల నుంచి తొలగించాలని వాచాలత్వాన్ని ప్రదర్శించారు. ఇలాంటి అసత్య, సూడో సైన్స్ వాదనలు ప్రపంచ శాస్త్ర వారసత్వాన్ని అపహాస్యం చేయడం మినహా మరొకటి కాదు. ఇటువంటివి విన్నప్పుడే మన శాస్త్ర ప్రగతి ఎటు పోతున్నదనే సందేహం కలుగుతుంది. మరోవైపు నూతన విద్యా విధానానికి అనుగుణంగా కేంద్ర విద్యాశాఖ పాఠ్యాంశాల తొలగింపు ప్రారంభించింది. మొన్న ఎన్‌సిఇఆర్‌టి పదవ తరగతి సిలబస్ నుంచి డార్విన్ జీవపరిణామాల క్రమం, పునరుత్పత్తి పాఠ్యాంశాలను తొలగించడం వివాదంగా మారింది. ఇందుకు అభ్యంతరం తెలుపుతూ 1800 మందికి పైగా శాస్త్రవేత్తలు, సైన్స్ అధ్యాపకులు, మేధావులు ప్రభుత్వానికి బహిరంగ లేఖలు రాశారు. శాస్త్రీయ దృక్పథాన్ని అలవరచుకోవడానికి డార్విన్ సిద్ధాంతం సెకండరీ స్థాయి పుస్తకాల్లో ఉంచాలని శాస్త్రవేత్తలు కోరారు. డార్విన్ పరిణామ క్రమాన్ని తొలగిస్తే భావి మస్తిష్కాలకు జీవుల పుట్టుక, ఆవిర్భావం గురించి ఏం చెప్పాలనేది ఇప్పుడు ప్రధానమైన ప్రశ్న. దీనికి సైతం దైవత్వాన్ని ముడి పెడతారేమోనని అనుమానం పలువురిలో రేకెత్తుతున్నది. ప్రకృతికి, జీవులకు మధ్య ఉన్న అవినాభావ సంబంధాన్ని శాస్త్రీయంగా, సైద్ధాంతికంగా నిరూపించి మానవ సమాజానికి అనువర్తనం చేసిన గొప్ప శాస్త్రవేత్త చార్లెస్ డార్విన్. జీవ పరిణామ సిద్ధాంతాన్ని విద్యార్థుల పాఠ్యాంశంలో భాగం చేసి విస్తృత ప్రాచుర్యం కల్పించాలి. నేటి సాంకేతిక యుగంలో సూడో సైన్స్ వాదనల నుంచి భారత్ బయటపడాలి. శాస్త్ర ప్రగతిని, సైంటిస్టుల సేవలను గుర్తించి, భావి తరాలకు అందించాలి. ప్రశ్నించే తత్వంతో కూడిన పౌర సమాజానికి పునాది వేయాలి. అప్పుడే భారతదేశం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందుతుంది.

# మణిపూర్‌ను హత్యాక్షేత్రంగా మారుస్తున్నారు



మణిపూర్ ముఖ్యమంత్రి బీరెన్ సింగ్ మరో మార్గం లేక ఎట్టకేలకు రాజీనామా చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, హోంమంత్రి అమిత్ షా తమకు విశ్వాసపాత్రుడైన బీరెన్ సింగ్‌ను అన్ని విధాలుగా రక్షించడానికి శాయశక్తులా ప్రయత్నించారు. కానీ ఫలితం లేకపోయింది. బిజెపిలో బీరెన్ సింగ్‌పై తిరుగుబాటు పెరగడంతో, కేంద్ర నాయకత్వం మిన్నకుండిపోయింది. బీరెన్ పదవి నుంచి నిష్క్రమించాల్సి వచ్చింది. మణిపూర్‌లో పరిస్థితి జాతి-మత ఘర్షణలతో దిగజారుతున్న తరుణంలో కేంద్ర నాయకత్వం ఆయన రాజీనామాను ఆమోదించి ఉంటే బహుశా అక్కడ జరిగిన ఊచకోతను నివారించగలిగేది. కేంద్రంలో 2014లో మొదటిసారిగా మోడీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి, ఈశాన్య ప్రాంతం సంఘ్ పరివార్‌కు ప్రయోగశాలగా మారింది. ఈశాన్య రాష్ట్రాలలో క్రైస్తవుల సంఖ్య ఎక్కువగా ఉండటం ఆర్‌ఎస్‌ఎస్, సంఘ్ పరివార్‌లకు ఎప్పుడూ నచ్చలేదు. దేశంలోని వివిధ ప్రాంతాల నుండి కార్యకర్తలను తీసుకురావడం ద్వారా ఈశాన్య ప్రాంతంలో తన ప్రభావాన్ని పెంచుకోవడానికి ఆర్‌ఎస్‌ఎస్ తీవ్రంగా ప్రయత్నించింది. కానీ ఫలించలేదు. అయితే, 2014లో కేంద్రంలో అధికార మార్పు ఈశాన్య ప్రాంతంలో సంఘ్ పరివార్‌కు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించింది. కేంద్ర ప్రభుత్వ మద్దతుతో బిజెపి ఈశాన్య రాష్ట్రాల్లో మెల్లగా అధికారాన్ని చేజిక్కించుకుంది. కాంగ్రెస్‌ను చీల్చడం ద్వారా అరుణాచల్ ప్రదేశ్, త్రిపుర, మణిపూర్‌లలో బిజెపి అధికారంలోకి వచ్చింది. కాంగ్రెస్ వరుసగా 15 సంవత్సరాలు పాలించిన మణిపూర్‌లో బిజెపి పట్టు సాధించింది బీరెన్ సింగ్ ద్వారానే. ఆయన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు. అంతేగాక మణిపూర్ ముఖ్యమంత్రి ఓక్రామ్ ఇబోబి సింగ్‌కు అత్యంత సన్నిహితుడు. 2016లో, బిజెపి బీరెన్ సింగ్‌ను 'ఆపరేషన్ కమల్'తో ఆకట్టుకుంది. 2017 అసెంబ్లీ ఎన్నికల్లో 28 సీట్లతో కాంగ్రెస్ ఏకైక అతి పెద్ద పార్టీగా అవతరించినప్పటికీ, కేవలం 21 సీట్లు మాత్రమే ఉన్న బిజెపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. కాన్రాడ్ సంగ్మా నేతృత్వంలోని నేషనల్ పీపుల్స్ ఫ్రంట్, నాగా పీపుల్స్ ఫ్రంట్ మద్దతుతో బిజెపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. బీరెన్ సింగ్ ముఖ్యమంత్రి అయ్యారు. ఫుట్‌బాల్ ఆటగాడైన బీరెన్ మణిపూర్ రాష్ట్ర జట్టు సభ్యుడు. ఆ క్రమంలోనే బిఎస్ఎఫ్ (బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్)కు ఎంపికయ్యాడు. ఫుట్‌బాల్ మైదానంలో వింగ్ బ్యాక్ స్థానంలో ఆడిన ఆయన, రాజకీయాల్లో స్ట్రైకర్ పాత్రకు మారాడు. బిజెపికి పూర్తి మెజారిటీ లేకపోవడంతో అప్పటి బీరెన్ సింగ్ ప్రభుత్వ పాలన ప్రశాంతంగా జరిగింది. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో, బిజెపి 32 సీట్లు గెలుచుకుని సంపూర్ణ మెజారిటీతో అధికారంలోకి వచ్చింది. 'ఆపరేషన్ ఆకర్ష్' ద్వారా వచ్చిన ఐదుగురు ఎమ్మెల్యేలతో, 60 మంది సభ్యులున్న అసెంబ్లీలో బిజెపి బలం 37కి పెరిగింది. దీనితో, పాలనా శైలి కూడా మారిపోయింది. కేవలం 33 లక్షల మంది జనాభా కలిగిన చిన్న రాష్ట్రమైన మణిపూర్‌లో, మెయితీలు 53 శాతంగా ఆధిపత్య సమూహంగా ఉన్నారు. నాగాలు 20 శాతం, కుకీలు 16 శాతం ఉన్నారు. పంగల్, కోమ్ వంటి చిన్న సమూహాలు కూడా ఉన్నాయి. మెయితీలలో కేవలం 10 శాతం మంది మాత్రమే క్రైస్తవులు కాగా, కుకి-నాగా సమాజంలో ఎక్కువ మంది క్రైస్తవులు వున్నారు. 1864 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో ఇంఫాల్ లోయ, దాని చుట్టూ కొండలతో మణిపూర్ ప్రకృతి దృశ్యం ఆకట్టుకుంటుంది. మెయితీలు పూర్తిగా లోయలలోను, కుకీలు, నాగాలు ఎక్కువగా కొండలలోనూ నివసిస్తారు.

### విద్వేష రాజకీయం

సంఘ్ పరివార్ క్రైస్తవ కుకీల పట్ల మెయితీలలో విద్వేషాన్ని రగిలించడం ద్వారా చీలిక రాజకీయాలకు పాల్పడుతోంది. బిజెపికి పూర్తి మెజారిటీ రావడంతో, విద్వేష రాజకీయాలు తీవ్రమయ్యాయి. ఆర్‌ఎస్‌ఎస్ నమూనాతో పనిచేసే అరంబై తెంకోల్, మెయితీ లీపున్ వంటి సంస్థలు సంఘ్ పరివార్ సహాయంతో క్రియాశీలకంగా మారాయి. కుకీ వ్యతిరేక భావన ఈ సంస్థల పునాదిగా వుంది. ముఖ్యమంత్రి బీరెన్ సింగ్ ఈ తీవ్రవాద సంస్థలను నేరుగా ప్రోత్సహించారు. బీరెన్ ప్రభుత్వం కుకీలను తరిమికొట్టడంతో పాటుగా, అనేక అణచివేత చర్యలకు పాల్పడింది. ఇది పెద్ద ఎత్తున నిరసనలకు దారితీసింది. మెయితీ తెగకు షెడ్యూల్డ్ తెగ హోదా కల్పించడాన్ని పరిశీలించాలన్న హైకోర్టు ఆదేశం మెయితీ-కుకీల మధ్య విద్వేషాలను రగిల్చింది. రెండు జాతుల మధ్య 2023 మే 3న ఘర్షణ ప్రారంభమైంది. తిరుగుబాటును ముందుగానే ప్లాన్ చేసుకున్న అరంబై తెంకోల్-మెయితీ లీపున్ సంస్థలు లోయ లోని, కొండల మీది క్రైస్తవ చర్చిలు, పాఠశాలలు మొదలైన వాటిపై విచక్షణా రహితంగా దాడి చేశాయి. లోయలో క్రైస్తవులను వేటాడారు. కుకీలు కూడా ఆయుధాలు చేపట్టడంతో మణిపూర్‌లో పరిస్థితి యుద్ధ వాతావరణాన్ని తలపించింది. మెయితీ-కుకి ప్రాంతాలు రెండు శత్రు రాజ్యాల మాదిరిగా విడిపోయాయి. మెయితీ తీవ్రవాద సంస్థలకు బహిరంగంగా మద్దతు ప్రకటించిన బీరెన్ సింగ్‌ను తొలగించాలని ప్రతిపక్ష పార్టీలు సమిష్టిగా డిమాండ్ చేసినప్పటికీ మోడీ, అమిత్ షా చెవికెక్కించుకోలేదు. నెలల తరబడి జరిగిన అల్లర్లలో దాదాపు 300 మంది మరణించారు. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. ఆస్తులను కోల్పోయారు. మహిళలపై అత్యాచారాలు జరిగాయి. లోక్‌సభ ఎన్నికలలో రెండు స్థానాల్లోనూ బిజెపిని ఓడించడం ద్వారా మణిపూర్ వాసులు ఒక హెచ్చరిక ఇచ్చారు. అయినప్పటికీ బీరెన్ సింగ్‌ను ప్రధాని నరేంద్ర మోడీ కాపాడుతూనే ఉన్నారు. స్పీకర్ తోక్‌చమ్ సత్యబ్రత సింగ్ సహా 18 మంది బిజెపి ఎమ్మెల్యేలు సింగ్‌ను వ్యతిరేకించారు. ప్రతిపక్షాలు తీసుకొచ్చిన అవిశ్వాస తీర్మానాన్ని ఆమోదిస్తామని స్పీకర్ కేంద్ర నాయకత్వానికి తెలియజేసిన తర్వాత గత్యంతరం లేని పరిస్థితిలో బీరెన్ రాజీనామా కోరారు అమిత్ షా. ఎనిమిదేళ్ల పాలన తర్వాత బీరెన్ సింగ్ రాజీనామా సమయానికి %ా% సంఘ్ పరివార్ విభజన రాజకీయాల కారణంగా ఏర్పడిన తీవ్ర గాయంతో మణిపూర్ అల్లాడుతోంది.

EDITOR, PRINTER, PUBLISHER AND OWNED BY SIRASALA SURESH KUMAR, Printed at M/S MARPU PUBLICATION,# /639-1-7-15, NANDYAL ROAD, CPI COLONY, 4TH ROAD, TADIPATRI-515 411, Ananthapuramu Dist., (A.P.), PUBLISHED AT # 1/639-1-7-15, NANDYAL ROAD,CPI COLONY, 4TH ROAD,TADIPATRI-515 411,Ananthapuramu Dist.,(A.P.). Cell:9398156948,REG.RNI: APTEL/2023/86845, E-Mail:janamnews19@gmail.com